
ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రత శనివారం గరిష్ఠం : 36.0 కనిష్ఠం : 25.0
ANDHRAJYOTHY
5
అనంతపురం
జిల్లా వార్తలు
ఆదివారం 6 జూలై 2025


శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి వేషధారణలో కళాకారులు


జగన్నాథుడి విగ్రహాన్ని తీసుకువస్తున్న ఇస్కాన్ భక్తులు

సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథ స్వామి ఊరేగింపు






కేఎస్ఆర్ కళాశాల ఆవరణ నుంచి రథయాత్రను వీక్షిస్తున్న విద్యార్థినులు


ఆధ్యాత్మిక సందేశమిస్తున్న సత్యగోపీనాథ్ స్వామి


కోలాటమాడుతున్న కౌసల్య బృందం

జగన్నాథా.. జయహో..

అనంతలో వైభవంగా రథోత్సవం

బలభద్ర, సుభద్ర సమేత జగన్నాథుడు అశేష భక్త జనం నడుమ నగరంలో ఊరేగాడు. ఇస్కాన్ అనంతపురం శాఖ ఆధ్వర్యంలో శనివారం రథయాత్ర నిర్వహించారు. ఇస్కాన్ జాతీయ ప్రతినిధి సత్యగోపీనాథ్ దాస్, సినీ నటుడు సుమన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రత్యేక పూజలు నిర్వహించి, రథాన్ని లాగి ఉత్సవాన్ని ప్రారంభించారు. యాత్ర సాగే మార్గాన్ని యువతులు, మహిళలు రంగవల్లికలతో అలంకరించారు. రథం ముందు కళా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఓం సంగీత నృత్య కళానిలయం నాట్యాచార్యురాలు దేవరకొండ కౌసల్య బృందం కోలాట ప్రదర్శన నిర్వహించారు. రథోత్సవం ముందు కేఎస్ఆర్ కళాశాల వద్ద నిర్వహించిన సభలో సత్యగోపీనాథ్ దాస్ ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. ప్రపంచ వ్యాప్తంగా నాలుగు వేల ప్రాంతాల్లో జగన్నాథ రథయాత్ర నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఇస్కాన్ మందిర చైర్మన్ దామోదర్ గౌరంగదాస్, చాంబర్ ఆఫ్ కామర్స్ సెక్రటరీ రంగారెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకుడు చిరంజీవి రెడ్డి, జిల్లా మాజీ అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం టౌన్



లోక్ అదాలత్‌లో రాజీ సంతోషకరం

జిల్లా ప్రధాన న్యాయాధికారి భీమారావు


మాట్లాడుతున్న భీమారావు

అనంతపురం క్రైం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): లోక్ అదాలత్ కోర్టులో రాజీనే రాజమార్గమని జిల్లా ప్రధాన న్యాయాధికారి భీమారావు పేర్కొన్నారు. కోర్టు ఆవరణలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయాధికారి భీమారావు మాట్లాడుతూ లోక్అదాలత్ తీర్పుకు ఎలాంటి అప్పీల్ చేసే అధికారం ఉండదన్నారు. రెగ్యులర్ కోర్టులలో కేసులు పరిష్కారమైనప్పుడు ఆ కేసుల్లో ఎవరో ఒకరే గెలిచే అవకాశం ఉంటుందని, మరొకరు బాధపడే అవకాశం ఉంటుందన్నారు. అయితే లోక్అదాలత్ కోర్టులో రాజీ మార్గం ఉండటం వల్ల ఇరు వర్గాలు సంతోషంగా ఇంటికి వెళ్లవచ్చునన్నారు. తర్వాత డీఎల్ఎస్ఏ కార్యదర్శి రాజశేఖర్ మాట్లాడుతూ..2వ జాతీయ లోక్ అదాలత్‌లో మోటార్ వాహన ప్రమాదాల 28 కేసుల్లో కక్షిదారులకు రూ. 1.57 కోట్ల నష్టపరిహారం ఇచ్చేలా తీర్పులు వెలువడ్డాయన్నారు. సివిల్ దావాలు 75, ప్రీలిటిగేషన్ కేసులు 3876, ఎన్ఐ యాక్ట్ కేసులు 22 పరిష్కా రమయ్యాయన్నారు. రెండో లోక్ అదాలత్‌లో మొత్తంగా 10,089 కేసులు పరిష్కారమైనట్టు తెలిపారు. కార్యక్రమంలో ఫస్ట్ ఏడీజే న్యాయాధికారి సత్యవాణి, ఇతర న్యాయాధికారులు, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గురుప్రసాద్, పలు బ్యాంకుల మేనేజర్లు, బీఎస్ఎన్ఎల్ అధికారులు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

చలి.. జ్వరం

● మంచంపట్టిన మన్నీల గ్రామం ● విషజ్వరాలతో వణుకుతున్న ప్రజలు ● ప్రతి ఇంటిలోనూ జ్వర పీడితులే ● నెలరోజులుగా ఇదే పరిస్థితి

అనంతపురం రూరల్, జూలై 5(ఆంధ్రజ్యోతి): అనంతపురం రూరల్ మండలంలోని మన్నీల గ్రామాన్ని విష జ్వరాలు వణికిస్తున్నాయి. ఇంటికొక్కరు జ్వరంతో అల్లాడిపోతున్నారు. ఊర్లో సగం మందికి పైగా మంచం పట్టారు. నెలరోజుల నుంచి గ్రామంలో ఈ పరిస్థితి నెలకొందని గ్రామస్థులంటున్నారు. సంబంధిత అధికారులు మాత్రం గ్రామం వైపు కన్నెత్తి చూడటం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈక్రమంలోనే ప్రైవేట్ ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. వాతావరణ పరిస్థితుల్లో మార్పులు రావడంతో గ్రామంలో ప్రతి ఇంటిని జ్వరాలు పీడిస్తున్నాయి. బీసీ కాలనీ, మారెమ్మ గుడి వెనుక భాగంలోని ప్రాంతాలు, ప్రభుత్వ పాఠశాల చుట్టుపక్కల పరిధిలో ఇళ్లలోని ప్రజలు విషజ్వరాలతో అల్లాడుతున్నారు. ఉన్నఫలంగా నీరసించిపోవడం.. తర్వాత చలి, వణుకు అలర్జీతో మొదలై జ్వరం విపరీతంగా వస్తున్నట్లు చెబుతున్నారు. నాలుగైదు రోజుల తర్వాత జ్వరం తగ్గినా విపరీతమైన కీళ్ల నొప్పులతో నిలబడలేక, కూర్చోలేక ఇబ్బంది పడుతున్నట్లు పేర్కొన్నారు.

అధ్వానంగా పరిసరాలు..

విషజ్వరాలు ప్రబలడానికి వాతావరణ పరిస్థితుల్లో నెలకొన్న మార్పులతోపాటు..పరిసర ప్రాంతాలు అధ్వానంగా ఉండటం కారణమని తెలుస్తోంది. గ్రామంలో రోడ్లపైనే మురుగునీరు పారుతోంది. ఈ నీరు ఇళ్ల మధ్య ఎక్కువ రోజులు నిల్వ ఉండటంతో దోమలు వృద్ధి చెంది, పగలు, రాత్రి తేడా కుడుతున్నట్లు గ్రామస్థులు చెబుతున్నారు. విషజ్వరాలు ప్రబలిన విషయం సంబంధిత సిబ్బందికి చెప్పినా పెడచెవిన పెట్టినట్లు తెలుస్తోంది.


ప్రభుత్వ పాఠశాల వెనుకభాగంలో నిలిచిన మురుగునీరు, పేరుకుపోయిన చెత్తాచెదారం

పది రోజులుగా అవస్థలు: రామాంజనేయులు

పదిరోజులుగా జ్వరంతో అవస్థలు పడుతున్నా. భరించలేని కీళ్లనొప్పులున్నాయి. పదిరోజులుగా ఇంట్లో నుంచి బయటకు వెళ్లలేని పరిస్థితి. అనంతపురం ఆస్పత్రికి వెళ్లి చూపించుకున్నా. నొప్పులు తగ్గడానికి నాలుగు నెలలు పడుతుం దంటున్నారు. వ్యవసాయ పనులుకు ఇబ్బందులు పడుతున్నా. వెళ్లకుంటే పనులు కావు. నొప్పుల మాత్రలు వేసుకుని పనులు చేసుంటున్నా.

వైద్య శిబిరం ఏర్పాటు చేయాలి



నాలుగురోజులుగా జ్వరంతో అవస్థలు పడుతున్నా. కీళ్ల నొప్పులు విపరీతంగా ఉన్నాయి. నడవలేని..కూర్చోలేని పరిస్థితి. గ్రామంలో చాలా మంది ఇలానే ఇబ్బంది పడుతున్నారు. గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయాలి.

-ఆదినారాయణ, మన్నీల గ్రామం

మనుషులు దొరకడం లేదు



గ్రామంలో జ్వరాలు తీవ్రస్థాయిలో ఉన్నాయి. దోమల నివారణకు ఫాగింగ్, స్ప్రేయింగ్ చేయించా. గ్రామంలో పారిశుధ్య పనులు చేయడానికి కార్మికులు దొరకడం లేదు. పంచాయతీ ఆధ్వర్యంలో రూ.6వేల వరకు వేతనం వస్తుంది. మరో రూ.3వేలు సొంతంగా ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నా. అయినా పనులు చేయడానికి ఎవరూ ముందుకు రావడం లేదు.

-త్రిలోక్‌నాయుడు, సర్పంచు

మీ ప్రభుత్వం బాగుంది నాయనా..!

ఎమ్మెల్యే దగ్గుపాటి, ఎంపీ అంబికాతో వృద్ధురాలు

నగరంలో 'సుపరిపాలనలో తొలి అడుగు'


ఎమ్మెల్యే, ఎంపీతో మాట్లాడుతున్న లీలావతి

అనంతపురం క్రైం, జూలై 5(ఆంధ్రజ్యోతి): 'మీ ప్రభుత్వం బాగుంది నాయనా...! అన్నీ అందుతున్నాయి..' అని మారుతీ నగర్‌కు చెందిన వృద్ధురాలు లీలావతి అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్‌తో అన్నారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణతో కలిసి శనివారం నగరంలోని 34వ డివిజన్‌లో ఎమ్మెల్యే 'సుపరిపాలనలో తొలి అడుగు' నిర్వహించారు. అంతకు మునుపు మారుతీ నగర్ ఫస్ట్ క్రాస్‌లో ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. కాలనీలో ఇంటింటికీ తిరుగుతూ, కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి వివరించారు. కరపత్రాలు అందించి, 'ఈ ప్రభుత్వం ఏలా పనిచేస్తోందా..? పింఛన్, బియ్యం అందుతున్నాయా..?' అని ప్రశ్నించారు. లీలావతి అనే వృద్ధురాలు ప్రభుత్వ పనితీరును మెచ్చుకున్నారు. 'మీ ప్రభుత్వం బాగుంది నాయనా..! అన్నీ అందుతున్నాయ్..' అని అన్నారు. 'నాకు పింఛన్ వస్తోంది. నాకు, నా మరిదికి కలిపి 10 కేజీల బియ్యం ఇస్తున్నారు. ఉచిత గ్యాస్ సిలిండ్ తీసుకున్నాం. నా మరిదికి పింఛన్ ఇప్పించండి చాలు..' అని అన్నారు. దీనికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. 'ఆగస్టు 15 నుంచి బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చు. పిల్లలతో కలిసి దగ్గర్లోని కసాపురం ఆలయం వంటి చోట్లకు వెళ్లొచ్చు..' అని ఎమ్మెల్యే, ఎంపీ ఆమె అన్నారు. మరో ఇంటి వద్ద రామకృష్ణ అనేవ్యక్తిని మాట్లాడించారు. ఏమైనా సమస్యలున్నాయా..? తల్లికి వందనం పడిందా..? ఇల్లు ఉందా..?' అని అడిగారు. 'నాకు ముగ్గురు పిల్లలు. గత ప్రభుత్వంలో రూ.13 వేలు పడింది. ఈ ప్రభుత్వంలో ముగ్గురికీ కలిపి రూ.39 వేలు పడింది. ప్రభుత్వం బాగా చూసుకుంటోంది' అని రామకృష్ణ హర్షం వ్యక్తం చేశారు. తనకు ఇల్లు లేదని, అద్దె ఇంట్లో ఉంటున్నానని అన్నారు. దీంతో ఇల్లు మంజూరయ్యేలా చూస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అప్పటికప్పుడు వివరాలు నమోదుకున్నారు. తనకు పింఛన్ ఇప్పించాలని ఓ దివ్యాంగురాలు విన్నవించారు. తప్పకుండా ఇప్పిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

మున్సిపాలిటీ నీరు తాగి అస్వస్థత

వాంతులు, విరేచనాలతో పలువురు ఆస్పత్రిపాలు

గుంతకల్లు టౌన్, జూలై 5(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కొళాయిల ద్వారా సరఫరా అయిన నీటిని తాగి 11వ వార్డు తిలక్‌నగర్‌లో పలువురు అస్వస్థతకు గురయ్యారు. కడుపు నొప్పి, వాంతులు, వీరేచనాలతో ప్రభుత్వ ఆసుపత్రిలో చేరారు. కాలనీలో ఉదయం మున్సిపల్ కొళాయిలకు నీటిని వదిలారు. వాటిని తాగిన కొద్దిసేపటికి గీత, ఆమె కుమార్తె దీపిక, కుమారుడు భరత్, అదే కాలనీకి చెందిన వనజ, లక్ష్మి వాంతులు, వీరచనాలు, కడుపునొప్పితో బాధపడ్డారు. సమస్య తీవ్రం కావడంతో వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అలాగే కళ్యాణి, చిట్టెక్క, బ్రహ్మ, భీమలింగ, రామ్‌లక్ష్మణ్, కార్తీక్, ఉదయ్ అనే వారు కూడా కడుపు నొప్పి, వాంతులతో ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి, చికిత్స చేయించుకున్నారు. బాధితులు మాట్లాడుతూ తమ కాలనీకి 8, 10 రోజుల కొకసారి తాగునీరు వదులుతున్నట్లు తెలిపారు. దీంతో నీరు దుర్వాసన వస్తోందని, కొన్ని సార్లు పురుగులు కూడా వచ్చాయన్నారు. నీరు ఎర్ర రంగులో వస్తోందన్నారు. శనివారం కూడా నీరు వాసన వచ్చినట్లు పేర్కొన్నారు. మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీరు వదిలినప్పుడు లైన్‌మెన్‌లు పరిశీస్తున్నారని అధికారులు చెబుతున్నారు. బాధితులను పట్టణానికి చెందిన సీపీఐ, సీపీఎం నాయకులు వేర్వేరుగా పరామర్శించారు.


మున్సిపల్ కొళాయిలో వచ్చిన పాచి పట్టిన నీరు


చికిత్స పొందుతున్న బాధితులు

కాలనీలో మున్సిపల్ అధికారుల పర్యటన

మున్సిపల్ కొళాయిల ద్వారా వచ్చిన నీటిని తాగి తిలక్‌నగర్‌లో పలువురు అస్వస్థతకు గురైన విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్, అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీదేవి, ఎంఈఈ ఇంతియాజ్ కాలనీలో శనివారం మధ్యాహ్నం పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీ మహిళలు మున్సిపల్ కొళాయిల ద్వారా వచ్చిన రంగుమారిన నీటిని వారికి చూపించారు. నీరు కలుషితం కాలేదని, ఫుడ్ పాయిజన్ వల్లే వాంతులు, వీరేచనాలు అయ్యాయని ఎంఈఈ తెలిపారు. కాగా సాయంత్రం డీఎంహెచ్ఓ కూడా బాధితులను పరామర్శించారు.

కర్షకుల కళ్లలో ఆనందం నింపుతాం

ప్రభుత్వ విప్ కాలవ, ఎమ్మెల్యే అమిలినేని

బీటీపీ కాలువ పనులు పునఃప్రారంభం

బ్రహ్మసముద్రం, జూలై 5(ఆంధ్రజ్యోతి): కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల జీవనాడి.. బీటీపీ కాలువను పూర్తి చేసి, కర్షకుల కళ్లలో ఆనందం నింపుతామని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అన్నారు. మండలంలోని వెస్ట్ కోడిపల్లి వద్ద హంద్రీనీవా-బీటీపీ కాలువ పనులను శనివారం వారు పునఃప్రారంభించారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, కలెక్టర్ వినోద్‌కుమార్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ హాజరయ్యారు. పనులు జరిగే ప్రాంతం వద్ద వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎన్టీఆర్ మానసపుత్రిక హంద్రీనీవా అని ఎంపీ అంబికా అన్నారు. ఆ పథకంలో భాగమైన బీటీపీ కాలువ పనులను పునః ప్రారంభించడం అదృష్టంగా భావిస్తున్నామని అన్నారు. సీఎం చంద్రబాబు రైతుల అభ్యున్నతికి ఎనలేని కృషి చేస్తున్నారని కాలవ అన్నారు. వేగంగా పనులను పూర్తి చేసి, ఏడాదిలోపే జీడిపల్లి రిజర్వాయర్ నుంచి బైరవానితిప్పకు కృష్ణాజలాలను తరలిస్తామని అన్నారు. వైసీపీ హయాంలో ఆగిపోయిన పనులను పునఃప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందని ఎమ్మెల్యే అమిలినేని అన్నారు. టీడీపీ ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు రూ.968 కోట్లు మంజూరు చేసిందని, అప్పట్లోనే 30 శాతం పనులను పూర్తి చేసిందన్నారు. వాటిని వైసీపీ ప్రభుత్వం కొనసాగించలేదని విమర్శించారు. వచ్చే రెండేళ్లలో ఈ ప్రాంతంలో రోడ్లు వేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు. బీటీపీ కాలువ పనులను పునఃప్రారంభించేందుకు సీఎం చంద్రబాబు అంగీకరించడం సంతోషకరమన్నారు. జగన్ ప్రభుత్వంలో ప్రభుత్వ ఉద్యోగులకు వేతనాలు ఇవ్వలేదని వెంకటశివుడు యాదవ్ విమర్శించారు. కూటమి అధికారంలోకి వచ్చాక అభివృద్ధి జరుగుతోందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు, హంద్రీనీవా ఎస్ఈ రాధాస్వరూప్ కుమార్, ఆర్డీవో వసంతబాబు పాల్గొన్నారు.


బీటీపీ పనులను పునఃప్రారంభిస్తున్న ఎంపీ అంబికా, ఎమ్మెల్యేలు కాలవ, అమిలినేని తదితరులు

గుట్టపై వైసీపీ గద్దలు..!
జగనన్న లేఅవుట్‌కు గుట్టలో మట్టి తవ్వకాలు
అదే స్థలం దర్జాగా కబ్జా
బోర్డు పాతి.. చేతులు దులుపుకున్న అధికారులు
7

ఆశా పోస్టుకు 83 దరఖాస్తులు
గుంతకల్లు, అనంతపురంలో తీవ్ర పోటీ
7

పన్నుల శాఖ జేసీగా హేమ
● డీసీతోపాటు సీటీఓలు, డీసీటీఓల బదిలీ

బైకును ఢీకొట్టిన బొలెరో ● ఇద్దరి దుర్మరణం 7

నేడు కుళ్లాయిస్వామి పెద్ద సరిగెత్తు 6

నేడు కుళ్లాయిస్వామి పెద్ద సరిగెత్తు

భారీగా చేరుకుంటున్న భక్తులు



పూజలు అందుకుంటున్న కుళ్లాయిస్వామి

నార్పల, జూలై 5(ఆంధ్రజ్యోతి): మతసామరస్యానికి ప్రతీకగా నిలిచిన గూగూడు కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి ఇష్టమైన పెద్ద సరిగెత్తు ఆదివారం నిర్వహించనున్నారు. శనివారం స్వామికి విడిది దినం కార్యక్రమం నిర్వహించారు. కుళ్లాయి స్వామి, ఆంజనేయస్వామిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. భక్తాదులు అగ్నిగుండంలో మొద్దులు వేసి మొక్కులు తీర్చుకున్నారు. పెద్ద సరిగెత్తుకు లక్షలాది మంది భక్తులు విచ్చేస్తారని అంచనా. దీంతో అందుకు తగ్గట్లు ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమయ్యారు. పలువురు దాతలు.. భక్తాదులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

భక్తురాలి మెడలో గొలుసు చోరీ



బాధితురాలు జయమ్మ

నార్పల, జూలై5(ఆంధ్రజ్యోతి): గూగూడు కుళ్లాయిస్వామి దర్శనానికి వచ్చిన జయమ్మ అనే భక్తురాలి మెడలోని రెండున్నర తులాల బంగారు చైన్‌ను గుర్తుతెలియని దుండుగులు చోరీ చేశారు. మండలంలోని జంగంరెడ్డిపల్లికి చెందిన జయమ్మ శనివారం ఉదయం 7 గంటలకు స్వామి దర్శనం కోసం వచ్చింది. ఆ సమయంలో గుర్తుతెలియని దుండగులు జయమ్మ మెడలో ఉన్న రెండున్నర తులాల బంగారు చైన్‌ను ఎత్తుకెళ్లారు. చోరీపై బాధితురాలు జయమ్మ కుమారుడు చౌరెడ్డి.. నార్పల పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

కన్నుల పండువగా గ్రామోత్సవం

గ్రామాల పర్యటనకు వెళ్లిన ఖాసీం స్వామి

బత్తలపల్లిలో ఘనంగా మొహర్రం వేడుకలు

బత్తలపల్లి, జూలై 5(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో ఖాసీం స్వామి గ్రామోత్సవం కన్నులపండువగా జరిగింది. ఖాసీం స్వామి పీరును రకరకాల పుష్పాలు, ఆభరణాలతో అందంగా అలంకరించారు. తప్పెట్లు, మేళతాళాల మధ్య శనివారం తెల్లవారుజామున 5గంటలకు మకానం నుంచి ఖాసీం స్వామి పీరును బయటకు తెచ్చారు. దీంతో పరిసర ప్రాంతాలు ఖాసీంస్వామి నామస్మరణతో మార్మోగాయి. గ్రామ వీధుల్లో పీరును ఊరేగించారు. ఇందులో భాగంగా గ్రామ పినపెద్ద జక్కంపూటి వెంకటేశు సమాధి వద్దకు చేరుకొని కొబ్బరికాయ కొట్టారు. అనంతరం గంటాపురం, వేల్పుమడుగు, పోట్లమర్రి గ్రామాలకు వెళ్లారు. ఆయా గ్రామాల్లో పీర్లు ఖాసీం స్వామికి ఎదురు వచ్చి భేటీ తీసుకున్నారు. ఈ భేటీని చూసేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమములో జక్కంపూటి సత్యనారాయణ, నాగభుషణ, తిరుపాలు, పురుషోత్తమచౌదరి, సుబ్బరాయుడు, జయప్ప తదితరులు పాల్గొన్నారు.

నేడు పెద్ద సరిగెత్తు

మొహర్రం ఉత్సవాల్లో భాగంగా బత్తలపల్లిలో ఆదివారం పెద్ద సరిగెత్తు నిర్వహించనున్నారు. కార్యక్రమాన్ని తిలకించేందుకు ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరానున్నారు.





గ్రామ వీధుల్లో ఊరేగుతున్న ఖాసీం స్వామి, వేల్పుమడుగులో ఖాసీం స్వామితో పీర్ల భేటీ

ఫ్రీ హోల్డ్‌కు ఇక మోక్షం..!

- జాబితాలో 34 వేల ఎకరాలు
- వేలాదిమంది రైతుల ఎదురుచూపు
- నిషేధం తొలగింపుతో హర్షం

అనంతపురం కలెక్టరేట్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఫ్రీ హోల్డ్ భూములపై నిషేధం తొలగించాలని ప్రభుత్వం నిర్ణయించడంతో రైతుల్లో హర్షం వ్యక్తమౌతోంది. ఫ్రీ హోల్డ్ కోసం వేలాది మంది రైతులు ఎదురుచూస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం 2023లో ఏపీ అసైన్డ్ భూముల చట్టం-1977(పీఓటీ)ను సవరించింది. అసైన్‌మెంట్ కాల పరిమితిలో 20 ఏళ్లు దాటిన భూములను నిషేధ జాబితా నుంచి తొలగించి (ఫ్రీ హోల్డ్) లబ్ధిదారులకు శాశ్వత హక్కులు కల్పిస్తూ పట్టాలు ఇచ్చేందుకు ఉత్తర్వులు జారీ చేసింది. అనంతరం టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అప్పట్లో కొన్ని భూముల విషయంలో అక్రమాలు జరిగాయని, రికార్డు లేనివి, చుక్కల భూములు కూడా ఫ్రీ హోల్డ్ చేసినట్లు నిర్ధారించింది. దీంతో వాటిని నిషేధిత జాబితాలోకి చేర్చారు. అప్పటి నుంచి వేలాది మంది రైతులు ఆ భూములపై ఉన్న నిషేధం ఎప్పుడు ఎత్తివేస్తారోనని ఆశతో ఎదురు చూస్తున్నారు. కూటమి ప్రభుత్వం తాజా నిర్ణయంతో బాధితులకు ఊరట కలగనుంది.

ఫ్రీ హోల్డ్‌లోకి అలా...

వైసీపీ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 13 లక్షల ఎకరాలను ఫ్రీహోల్డ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ అసైన్‌మెంట్ భూముల కమిటీ(పీఓటీ) చట్టం-1977లో 2023లో అప్పటి సర్కారు సవరణలు చేసింది. పేదలకు అసైన్డ్ చేసిన భూముల కాల పరిమితి 20 ఏళ్లు దాటి ఉంటే వాటిని నిషేధిత జాబితా (22)(ఏ) నుంచి తొలగించి (ఫ్రీ హోల్డ్) లబ్ధిదారులకు శాశ్వత యాజమాన్య హక్కులు కల్పించాలని చట్ట సవరణ చేశారు. దీని అమలుకు అదే ఏడాది డిసెంబరు 19న 596 జీఓ ఇచ్చారు. ఆ జీఓ ఆధారంగా అసైన్డ్ భూములను ఫ్రీ హోల్డ్ చేయాలి. అనంతరం ఆ భూములను రైతుల పేరిట ఎక్కిస్తారు. ఈ ప్రక్రియ ముగిశాక సంబంధిత రైతులు ఆ హక్కు కల్పిస్తారు. తద్వారా ఆ భూములను అమ్ముకునే హక్కు రైతులకు ఉంటుంది.

ఆ ముసుగులో దందా...

జిల్లా వ్యాప్తంగా దాదాపు 34,497 ఎకరాలను ఫ్రీ హోల్డ్ కింద చేర్చారు. అందులో జీఓ 596ను ఉల్లంఘించి మరీ అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలు ఉన్నాయి. నిబంధనలకు విరుద్ధంగా నిషేధిత జాబితా నుంచి కొన్ని ఎకరాల భూములు తొలగించారు. వాటిలో చట్టపరిధిలో లేని భూములు, రికార్డులు లేనివి, సర్వీస్ ఇనాం,



షరతు గల పట్టా, చుక్కల భూములను సైతం ఫ్రీ హోల్డ్ చేశారని సమాచారం. అలా జిల్లాలో 2500 ఎకరాల వరకు రిజిస్ట్రేషన్లు చేసినట్లు సమాచారం. శింగనమల, కళ్యాణదుర్గం, రాయదుర్గం, గుత్తి, అనంతపురం రూరల్, పామిడి తదితర ప్రాంతాల్లో ఎక్కువ రిజిస్ట్రేషన్లు చేసినట్లు తెలిసింది. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్ర వ్యాప్తంగా ఫ్రీ హోల్డ్ ముసుగులో దందా జరిగినట్లు గుర్తించారు. దీంతో గత ఏడాది ఆగస్టులో ఫ్రీ హోల్డ్ భూములు రిజిస్ట్రేషన్లు, తదితర వాటిపై నిషేధం విధించారు.

ఎదురు చూస్తున్న రైతులు..

ఫ్రీ హోల్డ్ నిషేధం తొలగించడంతో రిజిస్ట్రేషన్లు చేసుకోవడానికి వేలాది మంది రైతులు ఎదురుచూస్తున్నారు. అత్యధికంగా ఎకరం, రెండు ఎకరాలున్న రైతులు ఉన్నారు. ఫ్రీ హోల్డ్‌లో భాగంగా బినామీ, అక్రమాలతో కూడిన భూముల రిజిస్ట్రేషన్లు నిలిపివేయాలని నిర్ణయించారు. మొత్తం అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్లపై నిషేధం విధించడంతో నిజమైన హక్కుదారులకు అన్యాయం జరుగుతోందని ప్రభుత్వం గుర్తించింది. నిషేధం ఎత్తివేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో క్రయ, విక్రయదారులతో రిజిస్ట్రేషన్లు జరిగి రిజిస్ట్రేషన్ల శాఖ ద్వారా ప్రభుత్వానికి సైతం ఆదాయం సమకూరనుంది.

కౌన్సెలింగ్ తూచ్...!

సచివాలయ ఏఎన్ఎంలకు షాక్

రీ కౌన్సెలింగ్‌కు ఆదేశాలు



ఏఎన్ఎంలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి(ఫైల్)

అనంతపురం వైద్యం, జూలై 5(ఆంధ్రజ్యోతి): అధికారులు, సిబ్బంది రేయింబవళ్లు కష్టపడి కౌన్సెలింగ్ నిర్వహించారు. కోరుకున్న స్థానాలను దక్కించుకునేందుకు ఏఎన్ఎంలు తంటాలు పడి సిఫార్సు లేఖలను సమర్పించుకున్నారు. పైరవీలు.. జూమ్ మీటింగ్‌లు.. వ్యయప్రయాసలు.. అన్నీ పూర్తి అయ్యాయి. ఇక ఆర్డర్ కాపీలు ఇవ్వడమే తరువాయి. అవి కూడా సిద్ధమయ్యాయి. ఇంతలోనే అంతా తూచ్ అన్నారు. రీ కౌన్సెలింగ్ నిర్వహించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. దీంతో సచివాలయ ఏఎన్ఎంలు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు మైండ్ బ్లాంక్ అయింది. గత నెల 30వ తేదీకి సచివాలయ ఏఎన్ఎంల బదిలీలకు కౌన్సెలింగ్ పూర్తి చేశారు. ఈనెల ఒకటో తేదీనే ఆర్డర్ కాపీలను ఇవ్వాలని ఆదేశాలు ఉన్నాయి. దీంతో డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి, ఏఓ గిరిజ మహేశ్వరరావు, విభాగ అధికారి కమలాకర్ రాజు తదితరులు కంటిమీద కనుకులేకుండా శ్రమించారు. ఏఎన్ఎంలు తమ మొబైల్ ఫోన్‌లను ముందు పెట్టుకుని.. జూమ్ కౌన్సెలింగ్‌లో తమ వంతు ఎప్పుడు వస్తుందా అని నిరీక్షించారు. రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ అధికారులు పరుగులు పెట్టించారు. ఉమ్మడి జిల్లాలో 1,133 మంది ఏఎన్ఎంలు ఉన్నారు. వీరిలో కొందరికి గతనెలలో హెల్త్ అసిస్టెంట్‌లుగా ఉద్యోగోన్నతి కల్పించారు. కానీ వారికి స్థానాలు ఇవ్వకుండా అక్కడే ఉంచారు. ఇలా 300 పైగా పోస్టులను ఖాళీ చూపించి, కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆ కౌన్సెలింగ్‌ను తాజాగా రద్దు చేశారు. రీ కౌన్సెలింగ్ నిర్వహించాలని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ అధికారులు ఆదేశించారు. రీ కౌన్సెలింగ్ ఎప్పుడు అనేది త్వరలో ప్రకటిస్తామని డీఎంహెచ్ఓ తెలిపారు.

బుట్టలోకి సిఫార్సులు

కౌన్సెలింగ్‌లో కోరుకున్న స్థానాలు దక్కని ఏఎన్ఎంలు డీఎంహెచ్ఓ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. ప్రక్రియ ముగిసిందని అధికారులు చెప్పడంతో ఉద్యోగ సంఘాల నేతలు, ప్రజా ప్రతినిధుల నుంచి సిఫార్సు లేఖలు తెచ్చుకున్నారు. వాటిని అధికారులు పరిశీలించి, కొంతమందికి వెసులుబాటు కల్పించారు. ఇప్పుడు రీ కౌన్సెలింగ్ అనడంతో ఆ కష్టమంతా వృథా అయ్యిందని బాధితులు వాపోతున్నారు. సిఫార్సులన్నీ బుట్టలోకేనని, మళ్లీ ప్రయాస పడకతప్పదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గ్రీన్‌సిగ్నల్ ఇవ్వలేరా?

- కార్యాలయ పర్యవేక్షకులకు దక్కని గెజిటెడ్ హోదా
- పెండింగ్ పడుతున్న ఫైళ్లు
- వైద్య, ఆరోగ్యశాఖలో వింత వైఖరి





జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయం

అనంతపురం వైద్యం, జూలై 5(ఆంధ్రజ్యోతి): వైద్య, ఆరోగ్య శాఖలో కార్యాలయ పర్యవేక్షకుల(ఆఫీస్ సూపరింటెండెంట్)కు గెజిటెడ్‌హోదా లేకపోవడంతో సంబంధిత విభాగాల్లో ఫైల్స్ పేరుకుపోతున్నాయని ఉద్యోగులు వాపోతున్నారు. ఒక్కో ఫైల్ క్లియర్ కావాలంటే రోజుల తరబడి వేచిచూడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైద్య, ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న కార్యాలయ పర్యవేక్షకులకు గెజిటెడ్ హోదా కల్పిస్తామని కలెక్టర్ నుంచి రాష్ట్ర స్థాయి అధికారులవరకు హామీ ఇచ్చినా.. సంబంధిత ఫైల్‌ను, జీఓ కాపీలను పరిశీలించిన పాపాన పోలేదని ఉద్యోగవర్గాలు వాపోతున్నాయి.

ఫైళ్ల క్లియరెన్స్‌లో ఆలస్యం

ఉద్యోగ విరమణ పొందిన తరువాత ఆ వ్యక్తికి చెల్లించే ఆర్థిక ప్రయోజనాల వివరాలను ఒక ఫైల్‌గా రూపొందిస్తారు. ఏఏ విభాగంలో పనిచేశారు. ఎంతకాలం పోస్టులో ఉన్నారు. ఆ సమయంలో ఏవైనా కార్యాలయం, ప్రభుత్వానికి సంబంధించిన ఫైనాన్షియల్ పెండింగ్ ఉన్నాయా?. విధుల నిమిత్తం వినియోగించుకున్న ఉపకరణాలు, వస్తువులు తిరిగి అప్పజెప్పారా? ఆర్థిక ప్రయోజనాల మొత్తం ఎంత? తదితర అంశాలను ఫైల్‌లో పొందుపరుస్తారు. ఆ ఫైల్‌ను ఆఫీస్ సూపరింటెండెంట్, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ నుంచి ఉన్నతాధికారి వరకు పరిశీలించి ఆమోదం పొందిన తరువాతనే సంబంధిత ఉద్యోగి ఆర్థికప్రయోజనాలు పొందుతాడు. ఇలా అన్ని కార్యకలాపాలు ప్రభుత్వ శాఖల్లో ఫైల్ ద్వారా నడుస్తాయి. అయితే మొదటిమెట్టుగా ఫైల్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చే ఆఫీస్ సూపరింటెండెంట్‌కు గెజిటెడ్ హోదా లేకపోవడంతో వైద్య, ఆరోగ్యశాఖలో ఉన్నతాధికారికి ఫైల్స్ చేరడంలో జాప్యం నెలకొంటోందని ఉద్యోగ వర్గాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.

ఖర్చు లేకుండా గెజిటెడ్

గెజిటెడ్ హోదాకు రాష్ట్ర ప్రభుత్వ ఎలాంటి ఖర్చు చేయాల్సిన అవసరంలేదు. హోదా ఇచ్చినంత మాత్రాన సంబంధిత ఉద్యోగికి ఇంక్రిమెంట్లు చెల్లించాల్సిన పనిలేదు. ఇలాంటి పరిస్థితుల్లో కేవలం ఉత్తర్వులు జారీచేయడానికి సంవత్సరాల తరబడి కాలం వెల్లదీస్తుండటం ఏంటని ఉద్యోగవర్గాలు ప్రశ్నిస్తున్నాయి. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయం, వైద్య కళాశాల, నర్సింగ్ కళాశాలలో ఇద్దరు చొప్పున, సర్వజన వైద్యశాలలో ముగ్గురు చొప్పున ఇలా డీసీహెచ్ఎస్ తదితర కార్యాలయాల్లో పదుల సంఖ్యలో ఆఫీస్ సూపరింటెండెంట్లు పనిచేస్తున్నారు. వారికి గెజిటెడ్ హోదా కల్పిస్తే ఫైల్స్ పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్లియర్ అవుతాయని ఉద్యోగ వర్గాలు పేర్కొంటున్నాయి.

తలరాత బాగుండాలి..!

- అప్పుడే మంచి జరుగుతుంది
- పర్మినెంట్‌గా ఎవరినీ తొక్కేయలేరు
- సినీనటుడు సుమన్



ఎంపీ అంబికాతో మాట్లాడుతున్న హీరో సుమన్

అనంతపురం కలెక్టరేట్/క్రైం, జూలై 5(ఆంధ్రజ్యోతి): సినిమాలైనా, రాజకీయాలైనా తలరాత బాగుంటే మంచి జరుగుతుందని సినీ నటుడు సుమన్ అన్నారు. అనంతపురంలో శనివారం జరిగిన జగన్నాథ రథయాత్రలో ఆయన పాల్గొన్నారు. అనంతరం నగరంలోని బీసీ సంఘాల జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్‌గౌడ్ ఇంటికి వచ్చారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. పవన్ కల్యాణ్ డిప్యూటీ సీఎం అవుతారని ఏ జ్యోతిష్యుడూ చెప్పలేదని అన్నారు. గత ఎన్నికల్లో ఆయన అన్ని సీట్లూ ఓడిపోయారని, తనను ఒక్కసారైనా అసెంబ్లీకి పంపాలని ప్రజలను కోరారని అన్నారు. బిజినెస్‌లో అంబానీ తదితరులు పైకి వచ్చారని, రాసిపెట్టి ఉంటే అలా జరుగుతుందని అన్నారు. తొక్కడం లాంటివి పర్మినెంట్ కాదని, ఇది తన అనుభవమని అన్నారు. సినీ ఇండస్ట్రీలో 47 ఏళ్లలో ఎన్నో ఆటుపోట్లు చూశానని, సినీ ఫీల్డ్‌లో డబ్బు కావాలని అన్నారు. ఇదొక వ్యాపారమని అన్నారు. థియేటర్లు, షోలు అలాగే నడుస్తాయని అన్నారు. సీఎం చంద్రబాబు తనకు రాజకీయ గురువు అని, వాజ్‌పేయి హయాంలో తాను ఎన్నికల ప్రచారం చేశానని అన్నారు. వాజ్‌పేయి ఓడిపోయాక తాను రాజకీయాల నుంచి బయటకు వచ్చానని అన్నారు. జైలులో ఉన్న వాళ్లకు ఓటు హక్కు ఎందుకివ్వరు..? ప్రజాస్వామ్యంలో ఇది ఏమిటి అని ప్రశ్నించారు. రాజ్యసభ సీట్లను వేరే ప్రాంతం వారికి ఇస్తున్నారని, ఇలా చేస్తే స్థానికుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. రాజకీయాల్లో కన్ఫ్యూజన్ ఉందని, అందుకే ప్రస్తుతం రాజకీయాల్లోకి వెళ్లే ఆసక్తి లేదని అన్నారు. అనంతరం నాలుగో రోడ్డుకు చెందిన విద్యార్థి భానుప్రకాష్‌కు రమేష్‌గౌడ్ చేతుల మీదుగా రూ.1.20 లక్షల చెక్కును అందజేశారు.

అంబికా.. మీ తపన బాగుంది..

'ఎంపీగా ఎన్నికైన తక్కువ సమయంలోనే ఎక్కువగా కష్టపడ్డారు. ప్రజల కోసం మీరు పడే తపన బాగుంది..' అని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణను సుమన్ అభినందించారు. ఎంపీని ఆయన నివాసంలో కలిశారు. 'మీరు గెలిచిన వెంటనే ఒకసారి మాట్లాడించాను. మీరు పడుతున్న శ్రమను చూసి.. ఒకసారి తప్పకుండా కలవాలనిపించి వచ్చాను' అని అంబికాతో సుమన్ అన్నారు. ప్రజల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేస్తున్నారని, హాస్పిటల్ అభివృద్ధి పనులకు రూ.కోటి వరకూ కేటాయించడం అభినందనీయమని అన్నారు. సుమన్‌ను అంబికా ఘనంగా సత్కరించారు. సుమన్‌తో ఫొటోలు తీసుకునేందుకు అభిమానులు పోటీపడ్డారు.

శిక్షణలోనే సంపాదన

స్ఫూర్తిదాయకంగా గుడ్డ సంచుల తయారీ

ప్లాస్టిక్ నియంత్రణ.... పర్యావరణ పరిరక్షణ

ఆదర్శంగా నిలుస్తున్న 'అనంత' మహిళలు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 5(ఆంధ్రజ్యోతి): జీవనోపాధుల పెంపునకు ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలను అందిపుచ్చుకున్న అనంత మహిళలు కార్యసాధకులుగా నిలుస్తున్నారు. ప్లాస్టిక్ నియంత్రణకు ప్రభుత్వం చేస్తున్న ఉద్యమంలో తాము సైతం అంటూ అనంత మెప్మా పరిధిలోని స్వయం సహాయక సంఘాల మహిళలు బట్టసంచుల తయారీకి శ్రీకారం చుట్టారు. బీసీ కార్పొరేషన్, అనంత నగరపాలక సంస్థ పరిధిలోని మెప్మాకు సామాజిక సేవకుడు ఏజీ అనిల్‌కుమార్ సహకారం అందిస్తున్నారు. మెప్మాలోని సత్యసాయి ఐక్య సంఘం ఆధ్వర్యంలో నగరంలో చీరలతో బట్ట సంచుల తయారీకి చీరలు అందిస్తున్నారు. దాంతో పాటు ఒక్కో సంచికి రూ.10చొప్పున కుట్టేందుకు చెల్లిస్తూ...ఇప్పటి వరకు సుమారు లక్షకు పైగా బట్ట సంచులను తయారు చేయించి ఉచితంగా పంపిణీ చేశారు. ఇటీవల నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవంలో సుమారు 5వేల బట్ట సంచులు ఉచితంగా పంపిణీ చేశారు. శిక్షణలోనే ఒక్కో మహిళ నెలకు రూ.15వేల వరకు సంపాదిస్తున్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న తరువాత సర్టిఫికెట్, ఉచితంగా కుట్టు మిషన్ అందుకోనున్నారు. ఈ కుట్టు శిక్షణ కేంద్రాన్ని మెప్మా రాష్ట్ర వ్యాప్తంగా ఆదర్శంగా చూపిస్తోంది.

సంయుక్తంగా గుడ్డ సంచుల తయారీ



ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థ సహకారంతో కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభించాం. నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి, మెప్మా, బీసీ కార్పొరేషన్, పర్యావరణ సేవకుడు అనిల్‌కుమార్ ప్రోత్సాహంతోనే విజయవంతంగా స్వయం ఉపాధి కుట్టు శిక్షణ కేంద్రం ఏర్పాటు చేశాం. ఇందులో 135 మంది మహిళలు శిక్షణ పొందుతూ, స్వయం ఉపాధి కింద నెలకు రూ.15వేలు వరకు సంపాదిస్తున్నారు. బట్ట సంచుల తయారీతో ఓ వైపు మహిళకు ఉపాధి, మరోవైపు ప్లాస్టిక్ నిర్మూలనతో పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్నాం.

-సరస్వతి, అధ్యక్షురాలు, సత్యసాయి ఐక్యసంఘం



కుట్టు శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందుతున్న మహిళలు

చీరలతో సంచుల తయారీ

చీరలతో బట్ట సంచులను (బ్యాగ్) తయారు చేస్తూ...స్వయం ఉపాధి పొందుతున్నారు. ఏజీ అనిల్‌కుమార్ చీరలు అందిస్తున్నారు. ఒక్కో చీరకు 12 బ్యాగులు తయారు చేస్తున్నారు. ఒక్కో బ్యాగ్‌కు రూ.10 ఆయన చెల్లిస్తున్నారు. నగరంలోని సత్యసాయి ఐక్యసంఘం ద్వారా బీసీ కార్పొరేషన్, నగరపాలక సంస్థ మెప్మా సంయుక్తంగా కుట్టు శిక్షణ కేంద్రం ఏర్పాటు చేశారు. ఇందులో 135 మంది డ్వాక్రా సంఘాల మహిళలు శిక్షణ పొందుతున్నారు. శిక్షణ కాలంలోనే ఒక్కో మహిళ నెలకు రూ.15వేల వరకు సంపాదిస్తున్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి, ఏజీ అనిల్ కుమార్, మెప్మా పీడీలు అందిస్తున్న సహకారంపై మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. శిక్షణ కేంద్రాన్ని సందర్శించిన నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి, డిప్యూటీ కమిషనర్ పావని బట్టసంచుల తయారీని ప్రోత్సహించారు. డిప్యూటీ కమిషనర్ తల్లి సుమారు 50 చీరలు అందజేశారు.



తాము కుట్టిన గుడ్డ సంచులను చూపుతున్న మహిళలు

కుటుంబానికి తోడ్పాటు



ప్రభుత్వం అవకాశం కల్పించడంతో కుట్టు శిక్షణతో నెలకు వేతనం వస్తోంది. దీంతో కుటుంబానికి ఆర్థికంగా తోడ్పాడు ఇస్తున్నాను. మహిళలు చాలా ఆసక్తిగా కుట్టు శిక్షణ నేర్చుకుంటున్నారు. శిక్షణతో పాటు ఉపాధి మార్గాలు కూడా ఇక్కడే ఏర్పాటు చేయడం సంతోషంగా ఉంది. బట్ట సంచుల తయారీతో మాకు ఉపాధి లభించడంతో పాటు పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములవుతున్నాం. -నాగేశ్వరి, కుట్టు శిక్షకురాలు

శిక్షణలోనే ఉపాధి



ప్రభుత్వం కుట్టులో శిక్షణ ఇస్తోందని మహిళా సంఘం ద్వారా తెలుసుకున్నాను. శిక్షణ మాత్రమే ఇస్తారనుకున్నాం. శిక్షణతో పాటు ఇక్కడే స్వయం ఉపాధి కూడా కల్పిస్తున్నారు. గృహిణిగా ఖాళీగా ఉండే నాకు ప్రతి నెలా రూ.15వేలు సంపాదించే అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు. మెప్మా, శిక్షణ నిర్వాహకులు, అనిల్‌కుమార్ ప్రోత్సాహం మరువలేనిది.

-నాగజ్యోతి, శిక్షణ పొందుతున్న మహిళ

ఆఫ్‌లైన్ అనుమతులు నేరం

- అనధికార లే అవుట్లపై క్రిమినల్ చర్యలు
- జేసీ శివనారాయణ శర్మ

అనంతపురం కలెక్టరేట్, జూలై 5(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ వ్యవస్థ ఉన్నప్పటికీ కొందరు పంచాయతీ కార్యదర్శులు ఇప్పటికీ ఆఫ్‌లైన్ ద్వారా అనుమతులు జారీ చేస్తున్నారని, ఇది నేరమనీ, అలాంటివి చెల్లవని జాయింట్ కలెక్టర్, అహుడా ఇన్‌చార్జి వైస్‌చైర్‌పర్సన్ శివనారాయణ శర్మ హెచ్చరించారు. శనివారం కలెక్టరేట్‌లో అనంతపురం రూరల్, బుక్కరాయసముద్రం మండలాల పంచాయతీ కార్యదర్శులు, ఈఓఆర్డీలు, డీఎల్పీఓలతో పంచాయతీల పరిధిలో 'ఆన్‌లైన్ విధానంలో భవన నిర్మాణ అనుమతులు, అనధికారిక లేఅవుట్లపై చర్యలు' అనే అంశంపై జేసీ సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ.. అహుడా పరిధిలో భవన నిర్మాణ అనుమతుల ప్రక్రియ మరింత వేగంగా చేపట్టాలని ఆదేశించారు. అనధికార లేఅవుట్లు వేసి ప్రజలను మభ్యపెడుతూ ప్రభుత్వ ఖజానాకు గండికొడుతున్న రియల్టర్లు, భూయజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేయించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అహుడా కార్యదర్శి రామకృష్ణారెడ్డి, ప్లానింగ్ ఆఫీసర్ కేఎండీ ఇషాక్ పాల్గొన్నారు.

రేపు పామిడిలో పరిష్కార వేదిక

అనంతపురం కలెక్టరేట్, జూలై 5(ఆంధ్రజ్యోతి): ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికను ఈనెల 7వ తేదీన పామిడిలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ శనివారం ప్రకటనలో తెలిపారు. పామిడిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రజలు సమస్యలపై అర్జీలు ఇవ్వొచ్చన్నారు.

కమిటీ సభ్యుల నియామకం...

జిల్లా ఆహార సలహా కమిటీ, జిల్లాస్థాయి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులుగా పలువురిని నియమిస్తూ కలెక్టర్ వినోద్‌కుమార్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆంధ్రజ్యోతి బ్యూరో ఇన్‌చార్జి రామకృష్ణుడు, రాయలసీమ జాగృతి ఫౌండేషన్ చైర్మన్ శ్రీహరిమూర్తి, హెచ్ఎంటీవీ స్టాఫర్ ప్రవీణ్‌కుమార్, రెడ్స్ భానుజాను నియమించారు. కమిటీ చైర్మన్‌గా కలెక్టర్ వ్యవహరిస్తారు. ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, అధికారులు ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారు.

క్రైం కార్నర్

బైకును ఢీకొట్టిన బొలెరో

● ఇద్దరి దుర్మరణం ● పీర్లను చూసేందుకు వెళ్తుండగా ప్రమాదం



ప్రమాద స్థలంలో మృతదేహాలు, గుమిగూడిన జనం

బత్తలపల్లి, జూలై 5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం సమీపంలోని బైపాస్ రోడ్డుపై శనివారం ద్విచక్రవాహనాన్ని బొలెరో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గంటాపురం గ్రామానికి చెందిన ఓబులేసు(42) గుమ్మల్ల కుంటకు చెందిన సదాశివ(30) మృతిచెందారు. ఖాసీం స్వామి గ్రామోత్సవంలో భాగంగా పీర్లు వేల్పుమడుగుకు వెళ్తుండటంతో చూసేందుకు ఓబులేసు బైక్‌పై బయల్దేరాడు. అక్కడే ఉన్న సదాశివ తాను కూడా వస్తానని బైక్‌పై కూర్చున్నాడు. వెల్పుమడుగు క్రాస్ వద్దకు రాగానే అనంతపురం నుంచి ముదిగుబ్బ వైపు వెళ్తున్న బొలెరో వాహనం వారిని ఢీకొట్టింది. దీంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న మృతుల కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకొని బోరున విలపించారు. ఎస్ఐ సోమశేఖర్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని మృతదేహాలను ధర్మవరం ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న మంత్రి కార్యాలయ ఇన్‌చార్జ్ హరీ‌ష్‌బాబు ధర్మవరంలోని ప్రభుత్వ ఆస్పత్రి వద్దకు వెళ్లి మృతదేహాలను పరిశీలించారు. మృతుల కుటుంబాలను ఓదార్చారు. ఓబులేసుకు భార్య ఇద్దరు కుమారులు, సదాశివకు భార్య, కుమారుడు ఉన్నారు.

అమ్మను కొడుతున్నాడని..!

తండ్రిని చంపిన తనయుడు



పెద్ద గంగయ్య మృతదేహం

నార్పల, జూలై 5(ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి, తన తల్లిని నిత్యం హింసిస్తున్న తండ్రిని కుమారుడు కడతేర్చాడు. నార్పల మండల కేంద్రంలో శనివారం ఈ సంఘటన చోటు చేసుకుంది. నార్పల అంబేడ్కర్ కాలనీకి చెందిన పెద్ద గంగయ్య(54), లక్ష్మీదేవి దంపతులకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కుమారులకు వివాహమైంది. కూలి పనులు చేసుకుంటూ, ఉమ్మడి కుటుంబంగా జీవిస్తున్నారు. పెద్ద గంగయ్య మద్యానికి బానిసయ్యాడు. తాగి వచ్చి రోజూ భార్యను హింసించేవాడు. ఈ క్రమంలో శనివారం అతిగా మద్యం సేవించి వచ్చి, భార్య లక్ష్మీదేవిని చితకబాదాడు. దీన్ని గమనించిన చిన్న కొడుకు చిన్న కృష్ణయ్య తీవ్ర ఆగ్రహానికి లోనయ్యాడు. రోకలి బండ తీసుకుని తండ్రిపై దాడి చేశాడు. దీంతో పెద్ద గంగయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సాగర్ తెలిపారు.

మొక్కజొన్న కొని డబ్బులివ్వలేదని కేసు

యాడికి, జూలై 5(ఆంధ్రజ్యోతి): మొక్కజొన్నపంట కొనుగోలుచేసి డబ్బులు ఇవ్వకుండా మోసం చేశాడని హైదరాబాద్‌కు చెందిన వ్యాపారి సంతోష‌కుమార్‌పై శనివారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన మేరకు హైదరాబాద్‌కు చెందిన ఏ. సంతోష్‌కుమార్ తనకు శ్రీ చంద్రాల పరమేశ్వర ట్రేడర్స్ ఆల్ పౌల్ట్రీ ఇంగ్రిడియన్స్ అండ్ రా మెటీరియల్స్ సంస్థ ఉన్నదని చెప్పాడు. దానికి సంబంధించిన విజిటింగ్ కార్డును వాట్సా‌ప్‌లో యాడికి మండలం తూట్రాళ్లపల్లి గ్రామానికి చెందిన నూతల సాయి కల్యాణ్‌కు పంపాడు. మాయమాటలు చెప్పి 14లారీల మొక్కజొన్న పంటను ఆయన ద్వారా కొనుగోలు చేశాడు. అందుకు అయిన మొత్తం రూ.1,28,14,340 గాను రూ.68,26,080 ఇచ్చి మిగతా డబ్బు ఇవ్వకుండా మోసం చేశాడు. దీనిపై నూతల సాయి కల్యాణ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు సంతోష్‌కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కువైట్‌లో ఉద్యోగావకాశాలు

అనంతపురంరూరల్, జూలై5(ఆంధ్రజ్యోతి): కువైట్ దేశంలో నిర్మాణ రంగ ఉద్యోగాల కోసం నిరుద్యోగులు దరఖాస్తు చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) కార్యనిర్వాహక డైరెక్టర్ మనోహర్, జిల్లా అధికారి ప్రతాప్‌రెడ్డి శనివారం ప్రకటనలో తెలిపారు. ఓఎంసీఏపీ, దట్ రుయా సంస్థతో కలిసి కువైట్ దేశంలో నిర్మాణరంగ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. 24 నుంచి 50ఏళ్లలోపు వయసు పురుషులు అర్హులన్నారు. సెరామిక్ ఫ్లోరింగ్, పెయింటింగ్, ఎలక్ట్రికల్, సీలింగ్ పనుల్లో ఐటీఐ, డిప్లొమా చేసిన, 3 నుంచి ఐదేళ్ల అనుభవం గలవారు అర్హులన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆసక్తిగల వారు ఈనెల 15వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 9988853335 నంబరులో సంప్రదించాలన్నారు.

నేడు కుక్కలకు రేబిస్ నివారణ టీకాలు: జేడీ

అనంతపురం అర్బన్, జూలై5(ఆంధ్రజ్యోతి): ప్రపంచ జూనోసిస్ దినాన్ని పురస్కరించుకుని ఆదివారం జిల్లాలోని పశువైద్యశాలల్లో కుక్కలకు రేబిస్ వ్యాధి నివారణ టీకాలు ఉచితంగా వేయనున్నట్లు పశుసంవర్ధక శాఖ జేడీ సుధాకర్ ప్రకటనలో పేర్కొన్నారు. పశువుల నుంచి మనుషులకు సంక్రమించే రేబిస్, ఆంత్రాక్స్ బ్రుసెల్లోసిస్, బర్డ్ ఫ్లూ, స్వైన్ ఫ్లూ తదితర వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తామన్నారు. జిల్లాలోని అన్ని పశువైద్యశాలలకు ఇప్పటికే 19,980 డోస్‌ల రేబిస్ టీకాలు పంపామన్నారు. రేబీస్ లాంటి ప్రాణాంతక వ్యాధులు కుక్కల నుంచి మనుషులకు సంక్రమిస్తాయన్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని, పెంపుడు కుక్కలకు తప్పనిసరిగా రేబీస్ టీకాలు వేయించాలని సూచించారు.

చీనీ టన్ను రూ.19వేలు

అనంతపురం రూరల్,జూలై5(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో శనివారం చీనీకాయలు (గైరంగాలు) టన్ను గరిష్ఠంగా రూ.19వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.9వేలు, సరాసరిగా రూ.15వేలకు విక్రయాలు జరిగాయన్నారు. ఇక సీజనల్ రకం కాయలు టన్ను గరిష్ఠంగా 15వేలు, కనిష్ఠంగా రూ.4,200, సరాసరి ధర రూ.10వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 887 టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

గుట్టపై వైసీపీ గద్దలు..!

జగనన్న లే అవుట్‌కు గుట్టలో మట్టి తవ్వకాలు

అదే స్థలం దర్జాగా కబ్జా

బోర్డు పాతి.. చేతులు దులుపుకున్న అధికారులు



ప్రభుత్వ స్థలంలో రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన బోర్డు

గుత్తి, జూలై 5(ఆంధ్రజ్యోతి): గుట్టపై వైసీపీ గద్దలు వాలాయి. పట్టణంలో అనంతపురం రహదారికి పక్కనే ఉన్న ఖరీదైన గుట్టను మింగేస్తున్నాయి. గత వైసీపీ హయాంలో జగనన్న కాలనీకి గుట్టలో మట్టి తవ్వి, తరలించారు. ఆ తర్వాత అదే గుట్టపై కన్నేశారు. వైసీపీ నాయకులే పంచేసుకుని, ప్లాట్లు వేసుకున్నారు. కొందరు నిర్మాణాలు కూడా చేపట్టారు. ప్రధాన రహదారి పక్కనే ఈ కబ్జా పర్వాన్ని యథేచ్ఛగా సాగిస్తున్నా.. అధికారులు కళ్లు మూసుకున్నారు. గుట్టలో ప్రభుత్వ భూమి అంటూ బోర్డు పాతి, చేతులు దులుపుకున్నారు. దీంతో ప్రభుత్వం మారినా వైసీపీ కబ్జాదారులకు అధికారులు సహకరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తున్నాయి.



గుట్టలో అక్రమ కట్టడాలు

మట్టి తోలి..

మున్సిపాలిటీ పరిధిలో గత ప్రభుత్వం పేదలకు సెంటు స్థలం కేటాయిస్తూ జగనన్న కాలనీలు నిర్మించాలని నిర్ణయించుకుంది. దీనిని వైసీపీ నేతలు అవకాశంగా మలచుకున్నారు. జగనన్న కాలనీలో మౌలిక వసతుల కల్పన మాటున దోపిడీకి తెరలేపారు. పట్టణంలోని అనంతపురం రోడ్డు పక్కనే సర్వే నంబరు 590లోని గుట్టను తవ్వి జగనన్న కాలనీలో రోడ్ల ఏర్పాటుకు మట్టిని తరలించారు. ఓ వైసీపీ నేత మట్టిని తరలించాడు. మట్టి తరలింపునకు లక్షల్లో బిల్లులు దండుకున్నారన్న ఆరోపణలున్నాయి. మట్టి తరలింపుతో చదునైన గుట్టపై వైసీపీ నాయకుల కన్ను పడింది. రెవెన్యూ అధికారులపై ఒత్తిడి తెచ్చి అర ఎకరా మేర ఆక్రమించారు. ఇక్కడ సెంటు భూమి రూ.3 లక్షల వరకు ధర పలుకుతోంది. ఈ లెక్కన కబ్జా చేసిన భూమి విలువ రూ.కోటిన్నర ఉంటుంది. కబ్జాచేసిన ఆ భూమిలో కొంతమంది పునాదులు వేసుకోగా.. మరికొంతమంది విక్రయించుకుని సొమ్ము చేసుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ భూమి దర్జాగా కబ్జా అవుతున్నా సంబంధిత అధికారులు బోర్డులు పాతి చేతులు దులుపుకున్నారు. అలా.. కబ్జాదారులకు పరోక్షంగా అధికారులు సహకరించారన్న విమర్శలున్నాయి. బోర్డు పాతిన ఆ స్థలాన్ని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకోకపోవడం శోచనీయం. ప్రభుత్వం మారినా అధికారులు.. వైసీపీ నాయకులకే వత్తాసు పలుకుతున్నారన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు బోర్డుపాతిన స్థలాలను స్వాధీనం చేసుకుని, పేదలకు పట్టాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

స్వాధీనం చేసుకుంటాం: పుణ్యవతి, తహసీల్దార్, గుత్తి

బోర్డు పాతిన ప్రభుత్వ స్థలాలను స్వాధీనం చేసుకుంటాం. ఆ స్థలంలో ఎవరైనా నిర్మాణాలు చేపట్టివుంటే నోటీసులు జారీ చేసి, చర్యలు తీసుకుంటాం.

విజ్ఞాన సమాజ నిర్మాణమే లక్ష్యం

● ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు



క్షీరాభిషేకం చేస్తున్న తల్లులు

రాయదుర్గం, జూలై 5(ఆంధ్రజ్యోతి): విజ్ఞానవంతమైన సమాజ నిర్మాణమే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు వెళ్తోందని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. పట్టణంలోని 6, 9 వార్డుల పరిధిలో తల్లికి వందనం పథకం ద్వారా లబ్ధిపొందిన తల్లులు శనివారం ఏర్పాటు చేసిన ప్రభుత్వానికి కృతజ్ఞతాభివందనం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమ ప్రభుత్వం విద్యారంగంలో సంస్కరణలకు శ్రీకారం చుట్టినట్లు వెల్లడించారు. ఈక్రమంలోనే కూటమి ప్రభుత్వం కొలువుదీరిన ఏడాదిలోపే నియోజకవర్గానికి 27 ఉన్నత పాఠశాలలు మంజూరయ్యాయని పేర్కొన్నారు. వీటితో పాటు ప్రైమరీ మోడల్ స్కూల్స్ కూడా మంజూరు చేశారన్నారు. పట్టణ పరిధిలో వైసీపీ ప్రభుత్వం గతంలో 3812 మంది విద్యార్థులకు రూ. 4.95 కోట్లు అమ్మఒడి కింద మంజూరు చేసిందన్నారు. అదే కూటమి ప్రభుత్వం 8481 మంది విద్యార్థులకు రూ.11.02 కోట్లు మంజూరు చేసిందన్నారు. ప్రతి కుటుంబంలో ఎంతమంది చదువుకునే పిల్లలు ఉంటే అందరికీ ఒక్కొక్కరికి ఏడాదికి రూ. 13 వేలు చొప్పున వారి తల్లుల అకౌంట్‌లో జమ చేశామన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ప్రజల్లోకి వెళ్లినపుడు ప్రతి చోటా పిల్లలు, వారి తల్లిదండ్రులు ఆనందంతో ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. తమ పిల్లలు ఎలా చదువుతున్నారో నేరుగా సంబంధిత ఉపాధ్యాయులతో నేరుగా మాట్లాడి తెలుసుకోటానికి వీలుగా ఈనెల 10న మెగా పేరెంట్స్ మీటింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పొరాళ్ల పురుషోత్తం, వార్డ్ ఇన్‌చార్జ్ గౌరీలు పాల్గొన్నారు.

ఒక్కరు కూడా చేరలేదా..?

● రాష్ట్ర బృందం విస్మయం



మాట్లాడుతున్న రాష్ట్ర కమిటీ బృందం

అనంతపురం విద్య, జూలై 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 57 ప్రభుత్వ పాఠశాలలో ఒకటో తరగతిలో ఒక్క విద్యార్థి కూడా చేరకపోవడంపై రాష్ట్రకమిటీ బృందం విస్మయం వ్యక్తం చేసింది. రాష్ట్ర బృందం రెండోరోజు జిల్లాలో పర్యటించింది. ఐదు బృందాలుగా విడిపోయి, ఒక్కో బృందం ఒక్కో ప్రాంతానికి వెళ్లి పాఠశాలలను తనిఖీ చేసింది. గ్రామంలో పర్యటిస్తూ అక్కడ ప్రజలతో మాట్లాడుతూ బడిఈడు పిల్లలు ఎందరు ఉన్నారు? ఉంటే ఊర్లో ఉన్న బడిలో ఎందుకు చేరలేదు? తదితర వివరాలను ఆరా తీశారు. పాఠశాల ఎలా ఉంది? అక్కడ టీచర్లు ఎంతమంది ఉన్నారు? వారి పనితీరు, వసతులు గురించి పరిశీలించి ఫొటోలు తీసుకున్నారు. మరో మూడురోజులుపాటు జిల్లాలోనే ఉంటూ జీరోఎన్‌రోల్ ఉన్న 57 పాఠశాలలను తనిఖీ చేసి నివేదికలను తయారు చేసి, విద్యాశాఖ కమిషనర్‌కు అందజేయనున్నట్లు బృందం సభ్యులు మల్లికార్జునరావు తెలిపారు.

సదరం సర్వర్ డౌన్

● నేటితో ముగియున్న స్లాట్ బుకింగ్



సర్వర్ డౌన్ కావడంతో నిరీక్షిస్తున్న మహిళలు

అనంతపురం వైద్యం, జూలై 5(ఆంధ్రజ్యోతి): కంప్యూటర్ ఆధారిత వైకల్య ధ్రువీకరణ పత్రం కోసం స్లాట్ బుక్ చేసే సదరం సర్వర్‌డౌన్ కావడంతో బాధితులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శని, ఆదివారం స్లాట్ బుకింగ్‌ను ఓపెన్ చేశారు. అయితే తొలిరోజైన శనివారం ఉదయం ఒక గంట సమయం సర్వర్ పనిచేసింది. అనంతరం డౌన్ కావడంతో బాధితులు రాత్రివరకు సచివాలయాల్లో బారులు తీరారు. ఆదివారంతో స్లాట్‌బుకింగ్ గడువు ముగిసిపోతుందని బాధితులు ఆందోళన చెందుతున్నారు. సదరం ప్రక్రియను పర్యవేక్షించే డీసీహెచ్ఎస్, సర్వజన వైద్యశాల అధికారులు స్పందించి సమస్యను చక్కదిద్దాలని వేడుకుంటున్నారు. స్లాట్ బుకింగ్ క్లోజ్ అయితే తిరిగి ఎప్పుడు ఓపెన్ చేస్తారో తెలియదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లా భూగర్భగనుల శాఖ అధికారిగా ఆదినారాయణ



అనంతపురం క్లాక్‌టవర్, జూలై 5(ఆంధ్రజ్యోతి): జిల్లా భూగర్భగనుల శాఖ అధికారిగా ఆదినారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ భూగర్భ గనుల శాఖ రాష్ట్ర డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇదివరకు జిల్లా భూగర్భ గనుల శాఖ అధికారిగా ఉన్న వెంకటేశ్వర్లును అవినీతి, ఆరోపణల నేపథ్యంలో రాజధాని అమరావతిలోని ప్రధాన కార్యాలయానికి బదిలీ చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో అనంతపురం జిల్లా భూగర్భగనుల శాఖ కార్యాలయంలో అసిస్టెంట్ జియాలజిస్టుగా ఉన్న డి.ఆదినారాయణకు ఇన్‌చార్జి డీఎంజీఓగా బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. శనివారం కలెక్టర్ వినోద్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన అనంతరం స్థానిక హెచ్చెల్సీ కాలనీలో ఉన్న కార్యాలయంలో ఆదినారాయణ బాధ్యతలు స్వీకరించారు.

మొక్కలు నాటడాన్ని విజయవంతం చేయండి

అనంతపురం అర్బన్, జూలై 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 8వతేదీన చేపట్టే మొక్కలు నాటే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ పిలుపునిచ్చారు. విజయవాడ నుంచి శనివారం ఆయన పంచాయతీరాజ్ డైరెక్టర్ కలిసి అన్ని జిల్లాల పీడీలు, ఏపీడీలు, ఏపీఓలతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో డ్వామా పీడీ సలీమ్ బాషా, ఏపీడీ విజయ్‌కుమార్, ఏపీఓలు పాల్గొన్నారు.

నాటుసారా అమ్మితే జైలుకే: డీసీ

అనంతపురం క్రైం/బెళుగుప్ప, జూలై 5(ఆంధ్రజ్యోతి): సారా తయారు చేసి, విక్రయిస్తే పీడీ చట్టం ప్రయోగించి, జైలుకు పంపుతామని ఉమ్మడి జిల్లా జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్‌శాఖ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య హెచ్చరించారు. ఉమ్మడి జిల్లా అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, అనంతపురం జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామ్మోహన్‌రెడ్డి, ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీరామ్‌తో కలిసి శనివారం ఆయన జిల్లాలో పర్యటించారు. బెళుగుప్పలో నవోదయం 2.0పై గ్రామ సభ నిర్వహించారు. నాటుసారా నిర్మూలనపై ప్రజల్లో అవగాహన కల్పించారు. తర్వాత డీసీ నాగమద్దయ్య మాట్లాడుతూ.. సారా తయారుచేసినా, అమ్మినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అవసరమైతే పీడీ యాక్ట్ నమోదు చేసి జైలుకు పంపుతామన్నారు. సారా తాగడం ప్రాణాలకు ముప్పు అని, ఆరోగ్యం పాడవుతుందన్నారు. అనంతరం కళ్యాణదుర్గం ఎక్సైజ్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. కళ్యాణదుర్గం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఉండే కర్ణాటక సరిహద్దు గ్రామాల్లోకి కర్ణాటక మద్యం రాకుండా గట్టి నిఘా పెట్టాలన్నారు. కార్యక్రమంలో కళ్యాణదుర్గం ఎక్సైజ్ సీఐ సోమశేఖర్, ఎక్సైజ్ డీటీఎఫ్ జయనాథరెడ్డి, కళ్యాణదుర్గం ఎక్సైజ్ ఎస్ఐలు సుధాకర్, శంకర నారాయణ, ఇతర సిబ్బంది నరసరాజు, ప్రతాప్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య

ఆశా పోస్టుకు 83 దరఖాస్తులు..!

గుంతకల్లు, అనంతపురంలో తీవ్ర పోటీ

అనంతపురం వైద్యం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఆశా కార్యకర్త పోస్టుకు తీవ్ర పోటీ ఏర్పడింది. గుంతకల్లులోని 13వ సచివాలయ ప్రాంత పోస్టుకు ఏకంగా 83 దరఖాస్తులు రావడం విశేషం. గతనెల 25న జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ జారీచేసిన నోటిఫికేషన్ ద్వారా నిరుద్యోగ మహిళలు వారి అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు పెద్దసంఖ్యలో ముందుకొచ్చారు. గత నెల 30వ తేదీతో గడువు ముగిసింది. మొత్తం 58 పోస్టులకు ఏకంగా 780 దరఖాస్తులు రావడం విశేషం. 11 పోస్టులకు తీవ్రపోటీ నెలకొంది. ఒక్కో పోస్టుకు 20నుంచి 83 దరఖాస్తులు వచ్చాయి.

పోటీ తీవ్రం..

ఆశా కార్యకర్త పోస్టుల విషయంలో అనంతపురం, గుంతకల్లు మధ్య పోటీ నెలకొంది. అనంతపురంలోని 2వ రోడ్డు ప్రాంతం ఆశా కార్యకర్త పోస్టుకు 75, శ్రీనగర్ కాలనీకి 48, మిస్సమ్మ కాలనీకి 44 దరఖాస్తులు వచ్చాయి. గుంతకల్లులోని 13వ సచివాలయ ప్రాంత పోస్టుకు ఏకంగా 83 దరఖాస్తులు రావడం విశేషం. ఇదే అత్యధికం కావడం గమనార్హం. 32వ వార్డుకు 45, ఆచారమ్మ కొట్టాలకు 40 దరఖాస్తులు వచ్చాయి. గుత్తి సీపీఐ కాలనీ-3కి 35, రాయదుర్గం 1వ సచివాలయానికి 34 మంది. యర్రగుంటపల్లి-1కి 28, నారాయణపురం-5కి 22, శెట్టూరు 21 చొప్పున దరఖాస్తులు వచ్చాయి.

ఆ రెండిటికీ ఖరారు

మొత్తం 58 ఆశా కార్యకర్తల పోస్టుల భర్తీలో కణేకల్లు మండలం యర్రగుంట ఆరోగ్యకేంద్రం పరిధిలోని పుల్లంపల్లి, కొత్తపల్లికి ఒక్కొక్క దరఖాస్తు మాత్రమే వచ్చింది. ఈ లెక్కన ఆ రెండిటికి పోటీనే లేదు. దరఖాస్తు చేసుకున్న వారికి పోస్టులు ఖరారైనట్లే. ఏ.కొండాపురం, కందుకూరు-2 పోస్టులకు ఇద్దరు చొప్పున మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. ఆరు చొప్పున కేంద్రాలకు మూడు, నాలుగు, ఐదు చొప్పున దరఖాస్తులు వచ్చాయి.

పన్నుల శాఖ జేసీగా హేమ

● డీసీతో పాటు సీటీఓలు, డీసీటీఓలు బదిలీ

అనంతపురం కలెక్టరేట్, జూలై 5(ఆంధ్రజ్యోతి): వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్(జేసీ)గా ఇందుకూరి హేమను నియమించారు. ఈమె విజయవాడ-3 సర్కిల్ జేసీగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇక్కడ జేసీగా పని చేస్తున్న శేషాద్రిని విశాఖపట్నం సర్కిల్-1, సర్కిల్-2(ఎఫ్ఏసీ)కు బదిలీ చేశారు. డిప్యూటీ కమిషనర్ అంబటి మురళీమనోహర్ కర్నూలుకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో విజయనగరం డీసీగా ఉన్న భాస్కరవల్లి పెనుమాళను నియమించారు.

దగ్గర దగ్గరకే...

అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల పరిధిలో సీటీఓల బదిలీలు జరిగాయి. అయితే అనంతపురం-1 సీటీఓ సోనియాతార సమీపంలోని తాడిపత్రికి, తాడిపత్రి సీటీఓ సురేంద్రరెడ్డి హిందూపురానికి బదిలీ కావడం చర్చనీయాంశంగా మారింది. ఇక డీసీటీఓల బదిలీలు మరీ ఘోరం. పక్క పక్క సర్కిళ్లకే మార్చేసుకుని వ్యవహారం నడుపుకున్నా రనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. హిందూపురం సర్కిల్‌లో పలువురు ఏసీటీఓలు, మిగిలిన ప్రాంతాల్లో సీనియర్, జూనియర్ అసిస్టెంట్ల బదిలీలు జరిగాయి.

డీసీటీఓల బదిలీలు...

అనంతపురం-2 సర్కిల్ నుంచి డీసీటీఓ సుజాతను అనంతపురం1కు, తాడిపత్రి డీసీటీఓ భరత్‌మోహన్ అనంతపురం-1కు బదిలీ చేశారు. అనంతపురం-1నుంచి శ్రీనివాసులు అనంతపురం-2కు బదిలీ అయ్యారు. పుట్టపర్తి నుంచి సురేష్‌కుమార్‌ను, చిత్తూరు డీసీటీఓ శివమోహన్‌రెడ్డిని కళ్యాణదుర్గం సర్కిల్‌కు బదిలీ చేశా రు. కర్నూలు డీసీటీఓ అమర్‌నాథ్‌రెడ్డిని, తిరుపతి డీసీటీఓ ఎం.శ్రీనివాసులును తాడిపత్రికి బదిలీ చేశారు. తిరుపతి డీసీటీఓ శ్రీనివాసులును గుంతకల్లు సర్కిల్‌కు కేటాయించారు. కళ్యాణదుర్గం డీసీటీఓ(ఇన్‌చార్జ్ సీటీఓ) హరినాథ్, నంద్యాల డీసీటీఓ ప్రభాకరరెడ్డి, తాడిపత్రి డీసీటీఓ బి.శ్రీనివాసులు హిందూపురం సర్కిల్‌కు బదిలీ చేశారు. పుట్టపర్తి డీసీటీఓ శ్రీనివాసులరెడ్డిని కడప-1 కు, అనంతపురం-1 సర్కిల్ డీసీటీఓ వెంకటరమణను ఆదోనికి, కళ్యాణదుర్గం డీసీటీఓ సు దర్శనను నంద్యాల-1కు బదిలీ చేశారు.

సీటీఓల బదిలీలు...

అధికారి పేరు	ప్రస్తుతస్థానం	బదిలీస్థానం
సోనియాతార	అనంతపురం-1	తాడిపత్రి
పెద్దేటి నరసింహులు	అనంతపురం-2	మార్కాపురం
మౌనిక	మదనపల్లి	అనంతపురం-1
కూన రాకేష్	కాకినాడ	అనంతపురం-2
సుజిత	నంద్యాల-2	కళ్యాణదుర్గం
చందు	గుడివాడ	పుట్టపర్తి
సురేంద్రరెడ్డి	తాడిపత్రి	హిందూపురం

హెచ్చెల్సీ పరిశీలన



కాలువను పరిశీలిస్తున్న అధికారులు

కంప్లీ, జూలై 5(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర జలాశయం కింది భాగాన ఉన్న కుడికాలువ (హెచ్చెల్సీ)ని శనివారం అనంతపురం జిల్లా నీటి పారుదల శాఖ ఎస్ఈ విశ్వనాథరెడ్డి, తుంగభద్ర బోర్డు ఎస్ఈ నారాయణ నాయక్, మునరాబాద్ (టీపీసీ)ఎస్ఈ భరద్వాజ్, హెచ్చెల్సీ ఈఈ చంద్రశేఖర్ తదితరులు పరిశీలించారు. హెచ్చెల్సీ కాలువ చివర నుంచి జలాశయం వరకు పరిశీలించారు. ఈ నెల 10న జలాశయం నుంచి నీరు విడుదల చేయనుండంతో కాలువలోని యూటీయూలు, డీప్ కట్‌లు డిస్ట్రిబ్యూటర్ జలాశయంపైన జరుగుతున్న క్రస్ట్ గేట్ పనులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాలువను పరిశీలించిన తర్వాతే నీటిని విడుదల చేస్తామన్నారు. వారితో పాటు ఎస్‌డీవోలు ప్రవీణ్ కుమార్‌రెడ్డి, ప్రసన్న కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై పోలీసులకు ఫిర్యాదు



డీసీఎంఎస్ స్థలంలో చేపట్టిన అక్రమ నిర్మాణాలు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 5(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని డీసీఎంఎస్ స్థలంలో కొందరు అ క్రమ నిర్మాణాలు చేపట్టా రు. ఆర్టీసీ బస్టాండ్ నుంచి గుత్తిరోడ్డుకు వెళ్లే దారిలో ఉన్న డీసీఎంఎస్ స్థలంలో అనుమతి లేకుండా తాత్కాలిక షెడ్లు నిర్మించారు. అయితే ఇదే స్థలంలో ఓ ప్రబుద్ధుడు ఏకంగా శాశ్వత నిర్మాణాలకు పూనుకున్నాడు. ఇప్పటికే కొంత మేర ఆక్రమణకు గురైన స్థలాన్ని ఎలా కాపాడుకోవాలనే సందిగ్ధంలో ఉన్న డీసీఎంఎస్ అధికారులకు... శాశ్వత నిర్మాణాలు చేపట్టడంపై అప్రమత్తమయ్యారు. డీసీఎంఎస్ స్థలంలో అద్దెకు ఉంటూ పొజిషన్ సర్టిఫికెట్ పొందిన వారిపై, ఎటువంటి అనుమతి లేకుండా నిర్మాణాలు చేపట్టిన వారిపై శనివారం చైర్మన్ నెట్టెం వెంకటేశ్, మేనేజర్ విజయభాస్కర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఫిర్యాదు చేశాం: నెట్టెం వెంకటేష్, డీసీఎంఎస్ చైర్మన్

డీసీఎంఎస్ స్థలంలో అక్రమంగా చేపట్టిన నిర్మాణాలపై పోలీసులకు ఫిర్యాదు చేశాం. డీసీఎంఎస్ నుంచి ఎటువంటి అనుమతి లేకుండా ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపట్టడం, అద్దెకు ఉంటూ తమదే ఈ స్థలం అని చెప్పుకోవడం ఏంటో అర్థం కావడం లేదు. గత ప్రభుత్వం చేసినట్లు ఈ ప్రభుత్వంలో చేస్తే సహించేదిలేదు. డీసీఎంఎస్ స్థలాలను కాపాడుకునేందుకు ఎటువంటి చర్యలకైన వెనుకాడబోం.

సహకార బ్యాంకులతోనే బడుగుల ఆర్థికాభివృద్ధి



సహకార పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ముంటిమడుగు కేశవ రెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 5(ఆంధ్రజ్యోతి): సహకార బ్యాంకులతోనే బడుగు, బలహీన వర్గాల ఆర్థికాభివృద్ధి సాధ్యమని ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి అన్నారు. స్థానిక జిల్లా సహకార కేంద్రబ్యాంకు ఆవరణలో శనివారం నిర్వహించిన అంతర్జాతీయ సహకార దినోత్సవానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై సహకార పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ సహకార వ్యవస్థలోనే చిన్న సన్నకారు రైతులకు సకాలంలో రుణాలు అందుతున్నాయన్నారు. దీంతో వారి ఆర్థిక స్థితిగతులు మెరుగు పడుతున్నాయని తెలిపారు. అనంతరం సిబ్బందితో కలిసి సహకార ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డీసీఓ అరుణకుమారి, డీఎల్‌సీఓ శివమ్మ, ఏడీసీసీ బ్యాంకు ఓఎస్డీ సూర్యనారాయణ, డీజీఎంలు ఏబీ రాం ప్రసాద్, సుఖదేవబాబు, విజయచంద్రా రెడ్డి, డీసీఈఓ మురళీ మోహన్, సీనియర్ మేనేజర్ ఆర్‌వీ కృష్ణారెడ్డి, నాబార్డు డీడీఎం అనురాధా, సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

14న లక్నోకు ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ కేశవరెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్: జాతీయ సహకార బ్యాంకుల చైర్మన్ల సదస్సుకు ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి వెళ్లనున్నారు. ఈనెల 14, 15, 16 తేదీల్లో ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో సదస్సు జరగనుంది.

ఘనంగా సహకార దినోత్సవాలు



మాట్లాడుతున్న అర్బన్ బ్యాంకు చైర్మన్ జేఎల్ మురళీధర్

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 5(ఆంధ్రజ్యోతి): స్థానిక సుభా‌ష్‌రోడ్డులోని శ్రీకృష్ణదేవరాయభవన్‌లో గల అర్బన్‌బ్యాంకులో శనివారం 103వ అంతర్జాతీయ సహకార దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా అర్బన్ బ్యాంకు చైర్మన్ జేఎల్ మురళీధర్ పాల్గొని సహకార జెండా ఎగురవేశారు. అనంతరం బ్యాంకు డైరెక్టర్ సుంకర రమేష్ సభ్యులందరితో సహకార ప్రతిజ్ఞ చేయించారు. బ్యాంకు వైస్‌చైర్మన్లు మాగిశెట్టి చంద్రశేఖర్, మణి సుబ్రహ్మణ్యం, సీఈఓ విజయ్‌భాస్కర్, డైరెక్టర్లు, మేనేజర్లు పాల్గొన్నారు.

ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏను రెన్యువల్ చేయాలి

అనంతపురం వైద్యం, జూలై 5(ఆంధ్రజ్యోతి): ఆర్డీటీకి కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌సీఆర్‌ఏను రెన్యువల్ చేయాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకేహరి డిమాండ్ చేశారు. ఈ మేరకు సంఘం ఆధ్వర్యంలో శనివారం ఆయన నాయకులతో కలిసి స్థానిక ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ విగ్రహంవద్ద నిరసన తెలిపారు. అనంతరం ఆర్డీటీ డైరెక్టర్ మాంఛోఫెర్రర్‌ను కలిసి సంస్థ ఎదుర్కొంటున్న ఇబ్బందులపై చర్చించారు. నాయకులు రామకృష్ణ, ఓబయ్య, నాగరాజు, హనుమంతు, లింగప్ప, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి పల్లెపై ఆరోపణలు సరికాదు

అనంతపురం వైద్యం, జూలై 5(ఆంధ్రజ్యోతి): మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డిపై అసత్య ఆరోపణలు చేయడం సరికాదని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌నాయక్ అన్నారు. స్థానిక ఓ ప్రైవేట్ మీటింగ్ హాల్లో శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. పల్లె ఏడుగురు సభ్యులతో గ్లోబల్ హార్టికల్చర్ ప్రైవేట్ సంస్థ ఏర్పాటుచేశారన్నారు. ఆ సంస్థ ఆధ్వర్యంలో పెనుకొండలోని కియ పరిశ్రమ సమీపంలో 250 ఎకరాలు కొనుగోలుచేశారన్నారు. అయితే సంస్థ సభ్యుల్లోని ఒకరైన ఆదినారాయణ యాదవ్.. తోటి సభ్యుడైన పల్లె రఘునాథరెడ్డిపై అసత్య ఆరోపణలు చేస్తుండడం దుర్మార్గమన్నారు. పేదలకు సేలవలందిస్తున్న మాజీ మంత్రిని ఇలా నిందించడం తగదని హితవు పలికారు.

సినీనటుడు సుమన్‌కు సన్మానం



సుమన్‌ను సన్మానిస్తున్న బీసీ రమేష్‌గౌడ్

అనంతపురం వైద్యం, జూలై 5(ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీనటుడు సుమన్‌ను బీసీ సంఘాల జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి బీసీ రమేష్‌గౌడ్ ఘనంగా సన్మానించారు. నగరంలో శనివారం జరిగిన జగన్నాథ రథయాత్రలో పాల్గొనేందుకు సుమన్ వచ్చారు. దీంతో ఆయన్ను బీసీ రమేష్ గౌడ్ కలిసి శాలువా, పూలమాలతో సన్మానించి నంది ప్రతిమను బహూకరించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకుడు భాస్కర్‌బాబు, ఈడిగ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సు రేంద్ర, నాయకులు ఆదినారాయణ, ఈశ్వరయ్య, రేణుక యల్లమ్మ సొసైటీ అధ్యక్షుడు నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి హరిబాబు, స్వరూప్, రామ్మోహన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఏడు శనివారాల వ్రతాలకు శ్రీకారం

అనంతపురం టౌన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు ఆలయాల్లో శనివారం ఏడు శనివారాల వ్రతాలకు శ్రీకారం చుట్టారు. ఈ నేపథ్యంలో ఆర్ఎఫ్ రోడ్డులోని లక్ష్మీవెంకటేశ్వర ఆలయం, వేణుగోపాల్‌నగర్‌లోని సద్గురు సాయినాథ మందిరాల్లో శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులకు వేదపండితులు ప్రత్యేక అలంకరణలు చేయడంతో పాటు పూజలు చేశారు. అలాగే భక్తులు శాస్త్రోక్తంగా సామూహికంగా వ్రతాలను ఆచరించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.



ఆర్ఎఫ్ రోడ్డులోని లక్ష్మీవెంకటేశ్వరాలయంలో సామూహికంగా వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

లింగనిర్ధారణ నేరం: కలెక్టర్



అధికారులతో సమావేశమైన కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం కలెక్టరేట్, జూలై 5(ఆంధ్రజ్యోతి): లింగ నిర్ధారణ నేరమని, గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధిత (పీసీఅండ్‌పీఎన్డీటీ) చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో శనివారం ఆయన గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధిత చట్టానికి సంబంధించిన జిల్లాస్థాయి మల్టీ మెంబర్ అప్రాప్రియేట్ అథారిటీ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... జిల్లాలో ఏ ఆడపిల్ల కూడా పుట్టకముందే చనిపోకుండా చూడాలన్నారు. ఇందుకు పోలీసులు, స్వచ్ఛంద సంస్థలు, వైద్య ఆరోగ్యశాఖ, న్యాయశాఖ అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలన్నారు. ఆడపిల్లలను రక్షిద్దాం, బాలికల అభివృద్ధికి తోడ్పడుదాం అనే పోస్టర్లను అన్ని పాఠశాలల్లో ప్రదర్శించాలన్నారు. కలెక్టరేట్ డిస్ ప్లే బోర్డులో వచ్చేలా చూడాలన్నారు. కర్ణాటకలోని బళ్లారిలో లింగ నిర్ధారణ చేస్తున్న స్కానింగ్ సెంటర్ల వివరాలు ఇవ్వాలని, డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించాలని సూచించారు. ఇందుకు సంబంధించి ఇంటెలిజెన్స్ నివేదిక అందించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ లింగ నిర్ధారణ పరీక్షలు జరపకూడదని, చట్టం అతిక్రమించే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఈబీ దేవి, ఆర్డీటీ సంస్థ ప్రతినిధి దుర్గేష్, సీఐ బాషా, డెమో త్యాగరాజ్, డిప్యూటీ హెచ్‌ఈఓ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

- ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ
- శింగనమలలో సుపరిపాలనలో తొలిఅడుగు



బీసీ కాలనీలోని సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

శింగనమల, జూలై 5(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పేర్కొన్నారు. మండలకేంద్రంలోని బీసీ కాలనీలో శనివారం ఆమె టీడీపీ మండల నాయకులు, కార్యకర్తలతో కలిసి సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలకు కరపత్రాలు పంచుతూ ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి గురించి వివరించారు. అనంతరం అక్కడి రచ్చకట్ట వద్ద ఏర్పాటు చేసిన సభలో ఆమె మాట్లాడుతూ.. చంద్రబాబు పాలనలో రాష్ట్రం అభివృద్ధిలో పరుగులు పెడుతోందన్నారు. ఏడాదిలోనే ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేస్తారన్నారు. తర్వాత కాలనీవాసులు పలు సమస్యల్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా.. పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. టీడీపీ మండల కన్వీనర్ ఆదినారాయణ, రాష్ట్ర తెలుగుయువత అధికారప్రతినిధి దండు శ్రీనివాసులు, సీనియర్ నాయకులు మారుతీనాయుడు,ఈశ్వర్‌రెడ్డి చితంబరిదొర,ఎం.ఆదినారాయణ ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర 2047 ప్రారంభం..

శింగనమల ఎంపీడీఓ కార్యాలయంలో స్వర్ణాంధ్ర విజన్ 2047, పీ-4 సర్వే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే శ్రావణిశ్రీ, ఆర్డీఓ కేశవనాయుడు ప్రారంభించారు. ఎంపీపీ యోగేశ్వరి, ఎంపీడీఓలు భాస్కర్,సల్మాన్‌రాజ్, తహసీల్దార్ శేషారెడ్డి పారిశ్రామికవేత్త పసువుల శ్రీరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోకులం షెడ్లు ప్రారంభం

ఉపాధి పథకంలో శింగనమలలో ఓ రైతు నిర్మించిన గోకులం షెడ్డును ఎమ్మెల్యే శ్రావణిశ్రీ ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ భవిష్యత్తులో అర్హులైన రైతులకు మరిన్ని షెడ్లు మంజూరు చేస్తామన్నారు. పశువైద్యాధికారి కిరణ్‌కుమార్‌రెడ్డి, ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలి

- స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలి
- సీపీఐ నాయకుల డిమాండ్



జిల్లాకేంద్రంలోని విద్యుత్ కార్యాలయం వద్ద మాట్లాడుతున్న సీపీఐ జిల్లాకార్యదర్శి జాఫర్

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని, అలాగే స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు జిల్లాకేంద్రంలోని విద్యుత్ కార్యాలయాల వ ద్ద శనివారం ఆందోళన చేపట్టారు. తొలుత నగరకమిటీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ర్యాలీగా విద్యుత్ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. అక్క డ ప్రధానగేటువద్ద బైఠాయించి ఆందోళన చేశారు. పార్టీ జిల్లాకార్యదర్శి జాఫర్ మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నపుడు స్మార్టుమీటర్లను పగలకొట్టండని చెప్పిన నేతలు ఇపుడు అధికారంలోకి రాగానే అవే స్మార్ట్ మీటర్లను బలవంతంగా ఎలా బిగిస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికే విద్యుత్ చార్జీలు పెంచి వేలాదికోట్ల భారాన్ని ప్రజల నెత్తిన మోపారన్నారు. ఇపుడు మళ్లీ స్మార్ట్‌మీటర్ల ముసుగులో విపరీతమైన కరెంటు బిల్లులు పెంచి వినియోగదారులకు షాక్ ఇచ్చేందుకు యత్నిస్తున్నారని వా పోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం తననిర్ణయాలను మార్చుకోవాలన్నారు. లేకపోతే భవిష్యత్తులో పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలుపాల్గొన్నారు. అలాగే స్థానిక బళ్లారిరోడ్డులో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద, బుక్కరాయసముద్రంలోని నార్పల క్రాస్‌లో గల ట్రాన్స్‌కో కార్యాలయం వద్ద, గార్లదిన్నె విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద, రాప్తాడు తహసీల్దార్ కార్యాలయం వద్ద, నార్పలలోని విద్యుత్ కార్యాలయం వద్ద, శింగనమలలో విద్యుత్ కార్యాలయం వద్ద సీపీఐ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున ఆందోళనలు చేశారు. అనంతరం విద్యుత్ అధికారులకు డిమాండ్లపై వినతిపత్రాలు సమర్పించారు. పలుచోట్ల తొలుత ర్యాలీలు నిర్వహించారు.

పీర్ల చావిడికి తాళం

- ఇరువర్గాల మధ్య విబేధాలే కారణం



తాళం పడిన కౌడి పీర్ల చావిడి

శింగనమల, జూలై 5 (ఆంధ్రజ్యోతి):మండలకేంద్రంలోని కౌడిపీర్ల చావిడిలో శనివారం మొహర్రం సందర్భంగా పీర్లు ఎత్తుకునే విషయంలో రెండు వర్గాల మధ్య విబేదా లు తలెత్తాయి. దీంతో ఎవరూ కూడా పీర్లను ఎత్తుకూడదని చావిడికి తాళం వేశారు. పూర్వం నుంచి కౌడి చావిడిలోని మూడు పీర్లను ముస్లింలు ఎత్తుకునే వారు. అయితే రాను రాను ఆ కుటుంబాలు వివిధ ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాయి. దీంతో స్థానిక బలిజ, కాపు, నాయీబ్రాహ్మణ కులస్థులు ప్రతి ఏడాది మొహర్రంకు పీర్లు ఎత్తుతున్నారు. అయితే గత నాలుగేళ్ల నుంచి పీర్లు ఎత్తుకునే విషయంపై ఈ చావిడిలో ఏదో ఒక రాద్ధాంతం జరుగుతోంది. పెద్ద మనుషులు సర్దిచెప్పి పండుగ జరిపించేవారు. కాగా ఈ సంవత్సరమూ కాపు, నాయీబ్రాహ్మణ కులస్థుల మధ్య రాద్ధాం తం మొదలైంది. నాలుగు రోజుల నుంచి పీర్లు ఎత్తుకునే విషయంలో చర్చ జరుగుతున్నా ఫలించలేదు. శనివారం పెద్ద సరిగెత్తు రోజు చావిడిలో పీర్లు ఎత్తుకుని గ్రామంలో ఊరేగింపు చేయాలి. అయితే ఎవరూ కూడా పీర్లు ఎత్తకూడదని ఆ రెండు సామాజిక వర్గాల వారు చావిడికి తాళం వేశారు. దీంతో గ్రామస్థులు ఆందోళనకు గురవుతున్నారు. ఇలా చేస్తే గ్రామానికి అరిష్టం కలుగుతుందని భయపడుతున్నారు. పీర్ల పండగ ఇంకా రెండు రోజులు ఉందని గ్రామపెద్దలు మరోసారి రెండు వర్గాలకు సర్దిచెప్పి పీర్లను ఎత్తేలా చూడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

టీడీపీ నాయకుడి మృతికి నివాళి



నివాళులర్పిస్తున్న ఎల్ నారాయణచౌదరి

చెన్నేకొత్తపల్లి, జూలై 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని పులేటిపల్లికి చెందిన టీడీపీ నాయకుడు నారాయణరెడ్డి గుండెపోటుతో శుక్రవారం మృతిచెందిన విషయం తెలిసిందే. దీంతో పార్టీ సీనియర్ నేత ఎల్ నారాయణచౌదరి మండలంలోని పలువురు పార్టీ నాయకులతో కలిసి శనివారం ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి పార్టీ అం డగా ఉంటుందని భరోసా ఇచ్చారు. నివాళులర్పించిన వారిలో బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు కుంటిమద్దిరంగయ్య, మండల కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి, నాయకులు రామకృష్ణారెడ్డి, రామస్వామి, అంకే అమరేంద్ర తదితరులు ఉన్నారు.

విట్‌నెస్ నిబంధనను ఉపసంహరించుకోవాలి

అనంతపురం విద్య, జూలై 5(ఆంధ్రజ్యోతి): విట్‌నెస్ నిబంధనను ఉపసంహరించుకోవాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షప్రధానకార్యదర్శులు లింగమయ్య,గోవిందరాజు కోరారు. ఈ మేరకు స్థానిక విద్యాశాఖ కార్యాలయంలో శనివారం ఏడీ శ్రీనివాసులును కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. పాఠశాలల్లో మెగాపేరెంట్స్ మీటింగ్ వేడుకలు నిర్వహించినట్లు ఇతరశాఖకు చెందిన ఓఉద్యోగిని విట్నెస్‌గా ఉంచుకుని ఫొటోలు అప్‌లోడ్ చేయాలని ఉన్నతాధికారులు నిబంధన పెట్టడం టీచర్లను కించపరచడమేనని వాపోయారు. ఇలాంటి నిబంధనలు ఉపసంహరించుకోవాలన్నారు. నాయకులు లింగమయ్య, చంద్రమోహన్, కోటీశ్వరప్ప, ఓబులపతి, శివానంద, గౌస్, స్వాతి,రమేష్ మురళి, హనుమేష్ తదితరులు పాల్గొన్నారు.

సాయి నిత్యనారాయణ సేవకు 17 ఏళ్లు

అనంతపురం టౌన్, జూలై 5(ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన సాయి ట్రస్టు ఆధ్వర్యంలో నిత్యనారాయణ సేవ ప్రారంభించి శనివారం నాటికి 17 ఏళ్లు పూర్తయ్యాయి. ఈ నేపథ్యంలో శనివారం ప్రభుత్వ సర్వజనాస్పత్రి ముందు అన్నపూర్ణేశ్వరి మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శక్తి స్వరూప్ చిట్ ఫండ్స్ సహకారంతో దాదాపు వెయ్యి మందికి అన్నదానం చేపట్టారు. సాయి ట్రస్టు అధ్యక్షుడు విజయసాయికుమార్ , సభ్యులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన

గార్లదిన్నె, జూలై 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లూరు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శనివారం పుట్టుకతో వచ్చే లోపాలు, పెరుగుదల లోపాలు, పోషకాహరం లోపాలు, వ్యాధులపై ఆర్‌బీఎస్‌కే జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ నారాయణస్వామి అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. సర్పంచు ప్రశాంతి, హెచ్‌ఎం లోక్‌నాథ్, వైద్యులు పాల్గొన్నారు.

వీరారెడ్డి డబుల్ సెంచరీ



వీరారెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా క్రికెట్ క్రీడాకారుడు వీరారెడ్డి డబుల్ సెంచరీ చేశారు. కడపలో జరుగుతున్న ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అండర్-19 సౌత్ జోన్ మల్టీ డే క్రికెట్ పోటీల్లో భాగంగా అనంతపురం, కర్నూలు జట్లు తలపడగా మొదటి ఇన్నింగ్స్‌లో కర్నూలు 59.3ఓవర్లలో 213పరుగులకు ఆలౌట్ అయ్యింది. అనంతరం మొదటి ఇన్నింగ్స్ ప్రారంభించిన అనంతపూర్ జట్టు 92.2ఓవర్లలో 486పరుగులు చేసి 8వికెట్లు కోల్పోయి డిక్లేర్ చేసింది. జిల్లా బ్యాటర్ కేహెచ్ వీరారెడ్డి 267బంతుల్లో 30బౌండరీలు, 12సిక్సర్లతో 251పరుగులు చేశాడు. రెండో ఇన్నింగ్స్‌లో కర్నూలు జట్టు 26ఓవర్లలో 3వికెట్లు కోల్పోయి 115పరుగులు చేసింది. డబుల్ సెంచరీ సాధించిన వీరారెడ్డిని జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి భీమలింగారెడ్డి అభినందించారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు

అనంతపురం వైద్యం, జూలై 5(ఆంధ్రజ్యోతి): నగరంలో ఎంఈఎఫ్, ఎమ్మార్పీఎస్ సంయుక్తాధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలను, మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సదర్భంగా కేక్ కట్ శారు. ఎంఈఎఫ్ జాతీయ అదనపు ప్రధాన కార్యదర్శి శంకర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగాధర్, నాయకులు రమేష్, హనుమంతరావు, అశోక్‌కుమార్, నాగరాజు, పుల్లన్న తదితరులు పాల్గొన్నారు.

రక్షణపై అవగాహన

రామగిరి, జూలై 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని నసనకోట గ్రామంలో గల మహాత్మాజ్యోతి బాపూలే బాలికల గురుకుల పాఠశాలలో బాలికలకు ఎస్ఐ సుధాకర్‌యాదవ్ రక్షణపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తించినా, బయపెట్టినా వెంటనే తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, పోలీసులకు కానీ తెలపాలన్నారు. ధైర్యంగా 100 కాల్ చేయాలని సూచించారు. బాలికలపై అనుచితంగా ప్రవర్తిస్తే పోక్సోచట్టంకింద కఠిన శిక్షలు ఉంటాయని పేర్కొన్నారు. పాఠశాల ఉపాధ్యాయబృందం పాల్గొన్నారు.

శ్రీచైతన్య పాఠశాలలో పచ్చదనం.. పరిశుభ్రత



విద్యార్థినులకు మొక్కలను ఇస్తున్న ఏజీఎం

అనంతపురం విద్య, జూలై 5(ఆంధ్ర జ్యోతి) నగరంలోని హౌసింగ్‌బోర్డులో గల శ్రీచైతన్య పాఠశాలలో విద్యార్థులు శనివారం క్లీన్‌అండ్‌గ్రీన్ కార్యక్రమం నిర్వహించారు. ఏజీఎం సుబ్బారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులతో కలిసి ఆవరణలో మొక్కలునాటారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సమీనాఖాన్, కోఆర్డినేటర్ రాధాక్రిష్ణ, డీన్‌సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అనుబంధ కళాశాలల అధ్యాపకులతో వీసీ సమావేశం

అనంతపురంరూరల్, జూలై 5(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ అనుబంధ అనంతపురం, పులివెందుల, కలికిరి కళాశాలల అధ్యాపకులతో వైస్ చాన్సలర్ సుదర్శన్‌రావు శనివారం ఆన్‌లైన్‌లో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా నిజనిర్ధారణ కమిటీకి సంబంధించిన విషయాలను చర్చించారు. కమిటీలకు సంబంధించి అనుసరించాల్సిన నియమ, నిబంధనలు తెలియజేశారు. నిజనిర్ధారణ కమిటీ ఈనెల 6,7తేదీలలో ఉంటుందన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య కృష్ణయ్య మాట్లాడుతూ..నిజ నిర్ధారణ కమిటీలు అపిలియేషన్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసి సంబంధిత పత్రాలను విశ్వవిద్యాలయానికి అందజేయాలన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ అకాడమిక్ ఆడిట్ ఆచార్య దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అండర్ పాస్‌లకు ప్రతిపాదన: ఎంపీ, ఎమ్మెల్యే



రాంనగర్ ఫ్లైఓవర్ వద్ద పరిశీలిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

అనంతపురం క్రైం, జూలై 5(ఆంధ్రజ్యోతి): రాంనగర్, నాయక్ నగర్‌లో రైల్వే అండర్ పాస్‌ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించామని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. ట్రాఫిక్ రద్దీ, ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అండర్ పాస్‌ల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని తెలిపారు. చంద్రబాబు పాలనలో ప్రజలకు అన్ని పథకాలు సక్రమంగా అందుతున్నాయని వారు అన్నారు. 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా వారు 39వ డివిజన్‌లో శనివారం పర్యటించారు. రాంనగర్ బ్రిడ్జి కింద, అండర్ పాస్ ఏర్పాటు చేయాల్సిన ప్రాంతాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో టీడీపీ డివిజన్ ఇన్‌చార్జి సుధాకర్, రాష్ట్ర, జిల్లా నాయకులు గడ్డం సుబ్రమణ్యం, జేఎల్ మురళి, రాయల్ మురళి, సింగవరం రవి, ఆదినారాయణ, బుగ్గయ్య చౌదరి, సరిపూటి రమణ, సుధాకర్ యాదవ్, బాలాంజనేయులు, రాజారావు, భావన, సరళ, తేజస్విని, సాకే లక్ష్మీ నరసింహ, భవాని, నెట్టెం బాలకృష్ణ, లక్ష్మీనరసింహ, మూర్తి, బొమ్మినేని శివ, నరసింహులు, వెంకటేష్, లింగారెడ్డి, కొండన్న, పరమేష్, శివప్రసాద్, ఉమామహేశ్వర తదితరులు పాల్గొన్నారు.

రైతులకు వ్యవసాయ పనిముట్ల పంపిణీ

బుక్కరాయసముద్రం, జూలై 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో షెడ్యూల కులాల రైతులకు శనివారం వ్యవసాయ పనిముట్లను పంపిణీ చేశారు. మండలంలోని రేకులకుంటలో గల ఆచార్యఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధన కేంద్రంలో భారత సమన్వయ వాతావరణ పరిశోధన పథకం, జాతీయ వాతావరణ అనుకూల వ్యవసాయ పథకం కింద 150 మంది షెడ్యూల కులాల రైతులకు ఉచితంగా టార్పాలిన్ పట్ట, సైకిల్‌వీడర్, స్ప్రేయర్ తదితరాల పనిముట్లను పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిలుగా పరిశోధాన కేంద్రం వాతావరణ ప్రధాన శాస్త్రవేత్త విజయశంకర్‌బాబు, జిల్లా వ్యవసాయాధికారి ఉమా మహేశ్వరమ్మ, వాతావరణ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త గుత్తానారాయణస్వామి హాజరయ్యారు. కార్యక్రమంలో పరిశోధాన శాస్త్రవేత్తలు మాధవీలత, నటరాజ్, కేవీఎస్ సుధీర్ నజీరుద్దీన్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కుళ్లాయిస్వామి భక్తుల కోసం ప్రత్యేక కౌంటర్

అనంతపురం టౌన్, జూలై 5(ఆంధ్రజ్యోతి): గూగూడు కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని గూగూడుకు వెళ్లే భక్తులకోసం అనంతపురం ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సు కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా శనివారం బస్టాండు ఆవరణలో డిపో ఎదుట టెంట్ వేసి, ప్రయాణికులను అక్కడే ఉంచి బస్సులు ఎక్కించి పంపారు. ఇందుకోసం 9 ప్రత్యేక సర్వీసులను ఏర్పాటు చేశారు. బ్రహ్మోత్సవాలు ముగిసే వరకు ఈ సర్వీసులను నడుపుతామని డీఎం నాగభూపాల్ వెల్లడించారు.

వేతనాలు పెంచాలని వినతి

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 5(ఆంధ్రజ్యోతి): ఎటువంటి షరతులు లేకుండా మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు వేతనాలు పెంచాలని ఏఐటీయూసీ అనుబంధ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం స్థానిక నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ పావనికి వినతిపత్రం అందజేశారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్‌గౌడ్, ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి కృష్ణుడు, మున్సిపల్ యూనియన్ జిల్లా కోశాధికారి వేణుగోపాల్, జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు, నాయకులు ప్రసాద్, రామాంజినేయులు కుళ్ళాయమ్మ, బాలు తదితరులు పాల్గొన్నారు.

ఆ కథనంలో వాస్తవం లేదు: టీడీపీ



సాధారణ దారిలో మట్టి రోడ్డు వేస్తున్నామని చూపుతున్న టీడీపీ నాయకులు

కనగానపల్లి, జూలై 5(ఆంధ్రజ్యోతి): దారి విషయంలో పరిటాల అనుచరుల దౌర్జన్యం అంటూ శనివారం ఓ దినపత్రికలో వచ్చిన కథనంలో ఏ మాత్రం వాస్తవం లేదని భానుకోట, వేపకుంట గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు యువరాజు, రామలింగ చెంద్రాయుడు, కుళ్లాయి, రాజయ్య తెలిపారు. రోడ్డు పనుల వద్ద వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం అభివృద్ధి పనులలో భాగంగా భానుకోట సమీపంలో గాలిమరల ఏర్పాటుకు శ్రీకారం చుట్టిందని, ఈ క్రమంలో గాలిమరల విద్యుత్ కేంద్రానికి వెళ్లేందుకు దారి పనులను స్థానిక రైతుల అంగీకారం మేరకు పరిహారం ఇచ్చాకే చేపడుతున్నామని చెప్పారు. రైతు చంద్రశేఖర్ రెడ్డి పొలంలో చదును చేస్తున్నారనేది అవాస్తమన్నారు. గతంలో ఆరైతు అంగీకారం మేరకు అనాదిగా వెలుతున్న దారిలోనే రోడ్డు పనులు చేపట్టామన్నారు. ప్రభుత్వంపై, పరిటాల కుటుంబంపై బురద జల్లే కార్యక్రమాలు మాను కోవాలని వైసీపీ నాయకులకు హితవు పలికారు.

ఉద్యోగోన్నతులు కల్పించాలి: ఈయూ

అనంతపురం టౌన్, జూలై 5(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగులకు ప్రభుత్వం వెంటనే పదోన్నతులు కల్పించాలని ఎంప్లాయీస్ యూనియన్(ఈయూ) అనంతపురం డిపో కార్యదర్శి సోమశేఖర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం అనంతపురం డిపో ఎదుట ఆర్టీసీ ఉద్యోగులతో కలిసి ఎర్ర బ్యాడ్జీలు ధరించి ధర్నా నిర్వహించారు. ఇంకా ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను తెలిపి వాటిని పరిష్కరించాలని కోరారు. ఈయూ డిపో అధ్యక్షుడు ఎస్‌హెచ్‌ఆర్ ఖాన్ , జోనల్ నాయకుడు విశ్వనాథరెడ్డి, రీజియన్ నాయకులు గోపాల్, ఓబులరత్నం, గ్యారేజి అధ్యక్ష కార్యదర్శులు గంగాధర్, ముత్యాలన్నతదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

వచ్చే నాలుగేళ్లలో మరింత అభివృద్ధి : ఎమ్మెల్యే



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి

యాడికి, జూలై 5(ఆంధ్రజ్యోతి): వచ్చే నాలుగేళ్లల్లో తాడిపత్రి నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి తెలిపారు. శనివారం యాడికిలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు కూటమిప్రభుత్వం హామీలన్నింటిని ఒక్కొక్కటిగా అమలుపరుస్తూ వస్తోందని తెలిపారు. ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషిచేస్తానని అన్నారు. సీసీరోడ్లు వేయించాలని ఓంశాంతి కాలనీవాసులు కోరారు. కార్యక్రమంలో నాయకులు వేలూరు రంగయ్య, రుద్రమనాయుడు, పరిమి చరణ్, నీలకంఠ, ఆదినారాయణ, విశ్వనాథ్, చంద్రశేఖర్‌రెడ్డి, రమేష్, త్రినాథ్‌రెడ్డి, రవికుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

లక్షుంపల్లిలో 11 మందిపై కేసు నమోదు

యాడికి, జూలై 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్షుంపల్లిలో రస్తా వివాదంలో జరిగిన గొడవకు సంబంధించి ఇరువర్గాల ఫిర్యాదు మేరకు 11 మందిపై కేసునమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. లక్షుంపల్లిలో జయగంగిరెడ్డి, మహాదేవరెడ్డి మధ్య పొలాలకు వెళ్లే రస్తా విషయంలో వివాదం నెలకొంది. దీనిపై శుక్రవారం ఇరువర్గాల వారు దాడులు చేసుకున్నారు. ఈ సంఘటనలో ఇరువర్గాలకు చెందిన వారు గాయపడ్డారు.

డిగ్రీ అడ్మిషన్ల పోస్టర్ల ఆవిష్కరణ

గుంతకల్లు టౌన్, జూలై5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం మొదటి సంవత్సరం అడ్మిషన్ల పోస్టర్లను ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య మాట్లాడుతూ.. కళాశాలలో బీఏ, బీఎస్సీ, బీకాం కోర్సులకు అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణస్వామి, వైస్ ప్రిన్సిపాల్ రవిశంకర్ శర్మ, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఏడు ఇసుక ట్రాక్టర్ల సీజ్

తాడిపత్రి, జూలై 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్నానది నుంచి శనివారం అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఏడు ట్రాక్టర్లను సీజ్‌చేశామని రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. పెన్నానది నుంచి సజ్జలదిన్నె వద్ద అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారని సమాచారం అందడంతో స్పెషల్‌పార్టీ టీంతో కలిసి దాడులు నిర్వహించారు. ట్రాక్టర్లను తహసీల్దార్‌కు పంపించారు.

పాఠశాల మొత్తానికి ఐచ్ఛిక సెలవు ఇవ్వాలి

పామిడి, జూలై 5(ఆంధ్రజ్యోతి): పాఠశాల మొత్తానికి ఐచ్ఛిక సెలవును ఇవ్వాలని ఎస్టీయూ జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి నాగభూషణం డిమాండ్ చేశారు. స్థానిక మండల వనరుల కేంద్రంలో శనివారం ఎస్టీయూ నాయకులు విలేకరులతో మాట్లాడుతూ.. పాఠశాల వ్యవస్థలో ఎంతోకాలంగా ఐచ్ఛిక సెలవును పాఠశాల మొత్తానికి ఇస్తూ వస్తున్నారన్నారు. ఐచ్ఛిక సెలవును వ్యక్తిగతంగా వాడుకోవాలనడం సబబు కాదన్నారు. కార్యక్రమంలో నాయకులు రామాంజనేయులు, చంద్రశేఖర్, సుధాకర్, వీరాంజనేయులు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

టీడీపీ సమావేశం వాయిదా

పుట్లూరు, జూలై5(ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల కమిటీలు ఎంపిక చేసే విషయంలో శనివారం అబ్జర్వర్ రాకపోవడంతో వాయిదావేశారు. పార్టీకి సంబంధించి కన్వీనర్‌తోపాటు గ్రామ కమిటీలు వేయనున్నట్లు తెలుస్తోంది. మండల కన్వీనర్ పదవికి ఐదుగురు రేసులో ఉన్నట్లు సమాచారం.

ఏపీవోగా మురళీధర్ బాధ్యతలు

కుందుర్పి, జూలై 5(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ఇన్‌చార్జ్ ఏపీవోగా మురళీధర్ శనివారం బాధ్యతలు చేపట్టారు. యాడికిలో టెక్నికల్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ ఇన్‌చార్జ్ ఏపీవోగా నియమితులయ్యారు.

వెండి ఆభరణాల సమర్పణ

రాయదుర్గంరూరల్, జూలై 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని కదరంపల్లి పీర్లకు శనివారం శ్రీధర్‌శెట్టి, నాగవేణి దంపతులు 1.300 కిలోల వెండి ఆభరణాలు సమర్పించారు. ఆర్‌బీ వంక గ్రామానికి చెందిన వీరు రూ. 1.47 లక్షల విలువ చేసే వెండి ఆభరణాలను పెద్దలకు అందించారు.

అనుమానాస్పద స్థితిలో 45 గొర్రెపిల్లలు మృతి

కూడేరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కడదరకుంటలో పెద్దన్న అనే గొర్రెల కాపరికి చెందిన 45 గొర్రె పిల్లలు అనుమానాస్పదస్థితిలో మృతి చెందాయి. బాధితుడు తెలిపిన మేరకు.. నెల రోజులు వయసు ఉన్న పిల్లలను దొడ్డిలో వదిలి.. శుక్రవారం గొర్రెలను మేతకు తరలించారు. రాత్రి ఏడు గంటల సమయంలో తిరిగి వచ్చి చూడగా 45 గొర్రె పిల్లలు మృతి చెందాయి. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో శనివారం ఉదయం సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.



గొర్రెపిల్లల కళేబరాలు

రైతు బజారుకు మోక్షం ఎప్పుడో..?

● నిర్మాణం తుదిదశలో ఆగిన పనులు ● వృథాగా స్టాళ్లు ● పట్టించుకోని అధికారులు



గుంతకల్లులో నిర్మించిన రైతు బజారు



వృథాగా ఉన్న స్టాళ్లు

గుంతకల్లు, జూలై 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మార్కెట్ యార్డులో నిర్మించిన రైతు బజార్ త్రిశంకు స్వర్గంలో వేలాడుతోంది. కొన్ని పనులు పూర్తికాని కారణంగా ప్రారంభానికి నోచుకోవడంలేదు. రాష్ట్రంలో నియోజకవర్గానికి ఒక రైతు బజార్‌ను ఏర్పాటు చేస్తామని గత నెలలో ప్రభుత్వం ప్రకటించింది. రూ. 50 లక్షలతో అన్ని హంగులతో నిర్మించిన రైతు బజార్ లో విద్యుత్ సౌకర్యం కల్పించాల్సి ఉంది. తాగునీరు, బాత్‌రూంలు, టాయిలెట్ల ఏర్పాటు వద్ద పనులు నిలిచిపోయి ఎటూకాని స్థితిలో కొట్టుమిట్టాడుతోంది. మిగిలిన కాస్త పనులను చేయించడంలో అధికారులు కూడా నిర్లక్ష్యం వహిస్తున్నారు.

రైతు బజారు అత్యవసరం

గుంతకల్లులోని మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కూరగాయల మార్కెట్ పట్టణావసరాలకు సరిపోవడంలేదు. పాతగుంతకల్లు, దోనిముక్కల రోడ్డు, అంబేద్కర్ నగర్, మిల్లు కాలనీ, జగ్జీవన్‌రామ్ కాలనీ, సోనియా కాలనీ, తదితర ప్రాంతాల వారికి మార్కెట్ చాలా దూరంగా ఉండటంతో మరొక కూరగాయల మార్కెట్ అవసరం ఏర్పడింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇక్కడ రైతు బజార్, కోల్డు స్టోరేజీలను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. కరోనా సమయంలో ఆ ప్రాంతవాసుల సౌకర్యార్థం తాత్కాలికంగా మార్కెట్ యార్డులో కూరగాయల మార్కెట్‌ను ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి అక్కడ మార్కెట్‌ను ఏర్పాటు చేయాలన్న డిమాండ్ పెరిగింది. ఈ నేపథ్యంలో వైసీపీ ప్రభుత్వం మార్కెట్ యార్డులో రైతు బజార్‌ను నిర్మించడానికి రూ. 50 లక్షలు కేటాయించింది. దాదాపు తొంభైశాతం పనులు జరిగాక సార్వత్రిక ఎన్నికలు రావడంతో కాంట్రాక్టర్ తుది దశలో పనులను ఆపివేశాడు. అప్పటి నుంచి రైతు బజార్ అసంపూర్తిగా నిలిచిపోయింది. ఇప్పటికే నిర్మించిన స్టాళ్లు పూర్తయినా వృథాగా ఉన్నాయి.

రైతు బజార్లపై ప్రభుత్వం దృష్టి

రాష్ట్ర వ్యాప్తంగా నియోజకవర్గానికి ఒక రైతు బజార్‌ను నిర్మిస్తామంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు మేలో ప్రకటించారు. ఇదివరకే రైతు బజార్లు ఉన్న నియోజకవర్గ కేంద్రాలలో మినహా ఇతర చోట్ల నిర్మిస్తామని స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో తెలిపారు. గుంతకల్లులో రైతు బజార్‌ను నిర్మించాల్సిన అవసరంలేకుండా, సిద్ధంగా ఉన్న భవనానికి తుది మెరుగులు దిద్ది ప్రారంభించాల్సి ఉంది. ఈ రైతు బజార్‌లో ఇంకా రూ.18 లక్షల పని జరగాల్సి ఉంది. వెంటనే చర్యలు తీసుకుని కాంట్రాక్టరుచే పనులను పూర్తిచేయించాల్సిన అవసరం ఉంది.

ప్రతి పల్లెలోనూ ప్రశాంత వాతావరణం: పయ్యావుల



మహిళలతో మాట్లాడుతున్న మంత్రి పయ్యావుల కేశవ్

విడపనకల్లు, జూలై 5(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్ల పాలనలో ప్రజలు అభద్రత, అశాంతి మధ్య జీవనం సాగించారని, కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రతి పల్లెలోనూ ప్రశాంత వాతావరణం ఏర్పడిందని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. మండలంలోని డొనేకల్లు గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి శనివారం పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత అందుతున్న సంక్షేమ పథకాలను వివరించారు. సంక్షేమ పథకాలు అందాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. డొనేకల్లులో మహిళలు తాగు నీటి సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. మంత్రి స్పందించి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను పిలిచి తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు.

గడేకల్లులో ప్రారంభోత్సవాలు

డొనేకల్లు గ్రామంలో ఆంజనేయస్వామికి, గడేకల్లులోని భీమలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గడేకల్లు గ్రామంలో విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభించారు. రూ. 13.5 లక్షలతో ఆధునికీకరించిన ఎస్సీ బాలుర వసతి గృహ భవనాలు ప్రారంభించారు. గడేకల్లు-ఆర్‌కొట్టాల రోడ్డుకు భూమి పూజలు చేశారు. గ్రామంలో తాగునీటి కోసం నిర్మించిన నూతన ట్యాంక్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బీడీ చిన్న మారయ్య, హనుమంతు, రామాంజనేయులు, అమరేంద్ర, దేవేంద్ర, ప్రతాప్‌నాయుడు, భీమలింగప్ప, శ్రీనివాసులు, గురుస్వామి, కుమారుస్వామి, చంద్ర, తిమ్మరాజు, తిప్పారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

బోగస్ మస్టర్లతో ఫీల్డ్ అసిస్టెంట్ల చేతివాటం

మండల సమావేశంలో ఏపీఓను నిలదీసిన ఎంపీటీసీ



ఏపీఓను నిలదీస్తున్న ఎంపీటీసీ రాజశేఖర్

పామిడి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ పథకం పనుల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు చేతివాటం ప్రదర్శిస్తున్నారని రామగిరి ఎంపీటీసీ మజ్జిగ రాజశేఖర్ మండిపడ్డారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ మురళీమోహన్‌రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సభలో ఆయాశాఖాధికారులు తమ శాఖల సమాచారాన్ని తెలియజేశారు. ఉపాధి హామీ పథకంపై సమీక్ష రాగానే రామగిరి ఎంపీటీసీ మజ్జిగ రాజశేఖర్ మండిపడ్డారు. మండలంలోని పలువురు ఫీల్డ్ అసిస్టెంట్లు చేతివాటం ప్రదర్శిస్తున్నారని అన్నారు. కూలీలతో కాకుండా యంత్రాలతో పనులు చేయిస్తున్నారని ఆరోపించారు. ఈ ఆరోపణలు తమ దృష్టికి వచ్చాయని, విచారించి శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఏపీఓ ఆదినాయణమ్మ తెలిపారు. విద్యుత్ శాఖ సమీక్షకు రాగానే అధికారులు, ప్రజాప్రతినిధుల ప్రశ్నలకు ఆ శాఖ ఏఈ మధుసూదన్‌రావు సమాధానాలు నవ్వులు పూయించాయి. సమావేశంలో వైస్ ఎంపీపీ కాయల మహేష్, ఎంపీడీఓ తేజోత్స్న, తహసీల్దార్ షర్మిల, ఎంఈఓ జయానాయక్, ఏఈలు హేమ్లానాయక్, మధుసూదన్‌రావు, మారుతి, తిరుపాల్ నాయక్ పాల్గొన్నారు.

నేమకల్లు ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



బొమ్మనహాళ్, జూలై 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేమకల్లులో వెలసిన ఆంజనేయస్వామి మూలవిరాట్టుకు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు అనిల్‌కుమార్‌చార్యులు, సంతోష్‌కుమార్‌చార్యులు పూజలు చేశారు. వందలాది మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దేవదాయశాఖ ఈఓ నరసింహారెడ్డి, కాశీనాథ్‌శెట్టి పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో మహిళకు గాయాలు

గుత్తిరూరల్, జూలై 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మాపురం గ్రామంలో శనివారం విద్యుత్ షాక్‌తో లక్ష్మీదేవి అనే మహిళకు గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన ఆంజనేయులు భార్య లక్ష్మీదేవి ఇంటి ముందు నీళ్ల చలుతుండడంతో దగ్గర ఉన్న విద్యుత్ స్తంభానికి తగలడంతో విద్యుత్ సరఫరా కావడంతో షాక్ గురైంది. బంధువులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

గ్రామీణాభివృద్ధి దినోత్సవాన్ని జయప్రదం చేయండి

బొమ్మనహాళ్, జూలై 5(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ గ్రామీణాభివృద్ధి దినోత్సవం సందర్భంగా ఆదివారం నిర్వహించే కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఎంపీడీఓ విజయభాస్కర్ పేర్కొన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ పథకం టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు, వైద్య, హౌసింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు.

కౌలురైతుల రక్షణకు సమగ్ర చట్టం చేయాలి

కణేకల్లు, జూలై 5(ఆంధ్రజ్యోతి): కౌలురైతుల రక్షణకు సమగ్ర చట్టం చేయాలని సీఐటీయూ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, కోరి నాగరాజు, రైతు సంఘం నాయకులు జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఉపాధిహామీ పథకంలో పనిచేసే కూలీలకు రోజూవారి కూలీ రూ. 200 నుండి రూ. 600లకు పెంచాలని, అన్నదాత సుఖీభవ సొమ్మును రైతులకు వెంటనే అందించాలని, విద్యుత్ స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

టీడీపీతోనే సుపరిపాలన: గుమ్మనూరు జయరాం



జి. కొట్టాలలో మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

గుంతకల్లుటౌన్, జూలై 5(ఆంధ్రజ్యోతి): టీడీపీతోనే సుపరిపాలన సాధ్యమని టీడీపీ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. మండలంలోని జి. కొట్టాల గ్రామంలో శనివారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణస్వామి, బండారు రామన్న చౌదరి పాల్గొన్నారు.

బాధితులకు పరామర్శ

కలుషిత నీరు తాగి గుంతకల్లు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను శనివారం రాత్రి ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పరామర్శించారు. బాధితులు నీరు తాగడం వల్ల ఇలా జరిగిందా లేక ఫుడ్‌పాయిజన్ వల్ల ఇలా జరిగిందా అని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసీపీ నాయకులు ప్రతి చిన్న విషయాన్ని రాజకీయ చేయడం తగదన్నారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ రమాదేవి, కమిషనర్ నయీమ్‌అహ్మద్, వైద్యుడు జయవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

మొక్కలను కాపాడాలి

పెద్దవడుగూరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకం కింద నాటిన మొక్కలను కాపాడాలని ఎంపీటీసీ సభ్యుడు రమణ పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఎంపీపీ శ్రీదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీటీసీ రమణ మాట్లాడుతూ.. ఉపాధిహామీ పథకం కింద నాటిన చెట్లకు నీరును అందించకపోవడం వలన అవి ఎండిపోయి ప్రజాధనం వృథా అవుతోందని తెలిపారు. సమావేశంలో ఎంపీడీఓ బాలెన్‌సాబ్, అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల నమోదు తప్పనిసరి

రాయదుర్గం రూరల్, జూలై 5(ఆంధ్రజ్యోతి): ప్రతి ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల నమోదు ప్రక్రియ తప్పనిసరిగా చేయాలని రాష్ట్ర పర్యవేక్షణ బృందం సభ్యులు కేవీ మల్లికార్జున, శ్రీదేవి, కోటేశ్వరరావు సూచించారు. శనివారం ఎమ్మార్సీ భవనాన్ని సందర్శించి రికార్డులను తనిఖీ చేసి ఎంఈఓలకు, సిబ్బందికి తగు సలహాలు, సూచనలు అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు ఖచ్చితంగా 9 గంటలకు ఎఫ్‌ఆర్ వేసుకోవాలి, ఒక వేళ సెలవులో ఉంటే కాంప్లెక్స్ హెచ్‌ఎంకు, సీఆర్‌ఎంటీకి, ఎంఈఓకు ముందురోజు సమాచారాన్ని చేరవేయాలన్నారు. స్పెషల్ డ్యూటీ వేసుకున్నట్లైతే అక్కడ ఎఫ్‌ఆర్ వేసుకోవాలని తెలిపారు. కాంప్లెక్స్ పరంగా ఒక గ్రూపు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వెంకటరమేష్, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో పలు కేసుల పరిష్కారం



గుత్తిలో కేసులను పరిష్కరిస్తున్న జిల్లా న్యాయాధికారి

గుత్తి, జూలై 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలో కోర్టు ప్రాంగణంలో న్యాయసేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ లోక్‌ఆదాలత్‌లో 253 కేసులు పరిష్కారమయ్యాయి. ఈ సందర్భంగా బాధితులకు రూ. కోటి 40 లక్షల పరిహారం ఇప్పించేలా ఆరో అదనపు జిల్లా న్యాయాధికారి సాధుబాబు, సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి కాశీవిశ్వనాథాచారి తీర్పు వెల్లడించారు. ఇందులో జిల్లా అదనపు కోర్టులో 45 కేసులు, సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో 6, జూనియర్ సివిల్ జడ్జికోర్టులో 48, స్పెషల్ జ్యూడిషియల్ సెకెండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో 154 కేసులు పరిష్కారమయ్యాయి. కార్యక్రమంలో ఏజీపీ ఫక్రుభాష, న్యాయవాదులు మహేష్, సతీష్, రసూల్ పాల్గొన్నారు.

● తాడిపత్రి : పట్టణ, పరిసర ప్రాంతాల్లోని వివిధ కేసులకు సంబంధించి శనివారం సివిల్‌కోర్టు లోక్‌అదాలత్ న్యాయాధికారి మురళీనాయక్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో 124 కేసులు కొట్టివేశారని రూరల్, పట్టణ సీఐలు శివగంగాధర్‌రెడ్డి, సాయిప్రసాద్ తెలిపారు.

● రాయదుర్గం: జూనియర్ సివిల్ కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 176 కేసులు పరిష్కారమైనట్లు సివిల్ కోర్టు న్యాయాధికారి ఎం. రమ్య తెలిపారు. ఈ కేసుల్లో రుసుం కింద రూ. 8,67,628 చెల్లించినట్లు తెలిపారు. అదే విధంగా 264 పిట్టికేసుల్లో రూ. 1,63,050 రుసుం కింద చెల్లించారని తెలిపారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక



టీడీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

కళ్యాణదుర్గం, జూలై 5(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి వైసీపీ నుంచి టీడీపీలోకి పలువురు చేరారు. శనివారం పట్టణంలోని ప్రజావేదిక వద్ద ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు టీడీపీ కండువాలు వేసి ఆహ్వానించారు. శెట్టూరు మండలం ములకలేడు వైసీపీ మద్దతు సర్పంచు లక్ష్మీదేవి, ఆమె భర్త నాగరాజు, వైసీపీ నాయకులు ఎన్. తిప్పేస్వామి, రాజు, బాబు, రంగయ్య పాల్యం మారుతి, విజయ్‌కుమార్, కవితమ్మ, రామక్క, గౌరమ్మ టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వంలో అభివృద్ధికి నోచుకోక గ్రామాలన్నీ అంధకారంలో మగ్గిపోయాయని విమర్శించారు. సర్పంచులకు నిధులు లేక ఉత్సవ విగ్రహాలుగా మారిపోయారని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిధులిచ్చి పంచాయతీలకు జీవం పోశారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మొక్కు చెల్లించుకున్న జితేంద్రగౌడ్



గొడుగులు సమర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు

గుంతకల్లు టౌన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి):పట్టణంలోని ఆంథోని స్ట్రీట్‌లోని మాబుసుభానీ జెండా కట్టవద్ద ఉన్న పీర్లకు మాజీ ఎమ్మెల్యే ఆర్ జితేంద్ర గౌడ్, కుటుంబ సభ్యులు శనివారం రాత్రి మొక్కులు తీర్చుకున్నారు. స్వాములకు రెండు వెండి గొడుగులు, రెండు వెండి గుర్రాలు, పూలహారాలు సమర్పించి చక్కెర చదివించారు. ముజావర్లు వారి పేరట ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్‌ఛైర్మన్ ఆర్ శ్రీనాథ్ గౌడ్, హరినాథ్‌గౌడ్, రాణాప్రతాప్‌గౌడ్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మొహర్రం ప్రశాంతంగా జరుపుకోండి



నాయకులతో మాట్లాడుతున్న జేసీపీఆర్

పెద్దవడుగూరు, జూలై5(ఆంధ్రజ్యోతి): మండలంలోని దిమ్మగుడి గ్రామంలో శనివారం తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పర్యటించారు. స్థానిక ప్రజలతో సమావేశమై వర్గాల విభేదాల వల్ల గత 29 సంవత్సరాలుగా మొహర్రం వేడుకలకు ప్రజలు దూరంగా ఉన్నారని గతంలో జరిగిన ఘటనలు దృష్టిలో ఉంచుకొని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడకుండా ఐకమత్యంతో మొహర్రం వేడుకలు నిర్వహించుకోవాలని సూచించారు. ముందుగా మండలకేంద్రంలో పర్యటించి ప్రజల సమస్యలపై ఆరాతీసి వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కేశవరెడ్డి, గంగరాజుయాదవ్, రామ్‌రెడ్డి, తిలక్‌కుమార్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెట్లను నరకొద్దని విద్యార్థుల ర్యాలీ

కూడేరు, జూలై 5(ఆంధ్రజ్యోతి) : మొహర్రం పండుగ సందర్భంగా పచ్చని చెట్లను నరకవద్దని, ఎండిన చెట్లు నరికి అగ్ని గుండంలోకి వేయాలని జాగృతి సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులు నినాదాలు చేశారు. శనివారం మండల కేంద్రంలో గ్రామ పురవీధుల్లో జాగృతి సంస్థ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అగ్నిగుండంలోకి కేవలం ఎండినచెట్లను వేయాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలని ఆర్టీసీ కార్మికుల నిరసన

గుత్తి, జూలై5(ఆంధ్రజ్యోతి): తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రెండో రోజు శనివారం ఆర్టీసీ కార్మికులు స్థానిక డిపో ఎదుట ఆందోళన నిర్వహించారు. కార్మికులకు పదోన్నతులు కల్పించాలని, ఉద్యోగ భద్రత సర్క్యులర్ అమలు చేయాలని, డబుల్ డ్యూటీకి మొత్తాన్ని పెంచాలని, 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించి ఐఆర్‌పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జోనల్ అధ్యక్షుడు ఎంఆర్ ఆంజనేయులు, డెలిగేట్ బీకే రాముడు, కార్యదర్శి గంగేశ్వర్, రీజనల్ ఉపాధ్యక్షుడు హసేన్, డిపో అధ్యక్షుడు శ్రీనివాసులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలను తగ్గించాలని సీపీఐ నిరసనలు



గుంతకల్లులో నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

(న్యూస్‌నెట్ వర్క్ - ఆంధ్రజ్యోతి)

పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణమే తగ్గించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం పలుచోట్ల సీపీఐ నాయకులు నిరసనలు చేపట్టారు. గుంతకల్లు అజంతా సర్కిల్‌లో చేపట్టిన నిరసన కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడాది కాలంలో విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై భారం మోపారని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు గోవిందు, మహేష్, గోపినాథ్, ఎస్‌ఎండీ గౌస్, దేవేంద్ర పాల్గొన్నారు. గుత్తి ట్రాన్స్‌కో డివిజన్ కార్యాలయం ఎదుట సీపీఐ నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు రామదాస్, రాజు, రమేష్‌బాబు, వెంకటరాముడు, నరసింహయ్య, రామకృష్ణ పాల్గొన్నారు. పెంచిన విద్యుత్‌చార్జీలను తగ్గించడంతోపాటు స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలని కోరుతూ సీపీఐ నాయకులు రంగయ్య, చిరంజీవియాదవ్ తాడిపత్రిలో వేర్వేరు గా స్థానిక ట్రాన్స్‌కో కార్యాలయం వద్ద నిరసనలు చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు నాగేంద్ర, శ్రీరాములు, అబ్రహం, రత్నమయ్య, బాబయ్య, శీనా, రామకృష్ణ, రంగనాయకులు పాల్గొన్నారు. రాయదుర్గం లోని విద్యుత్‌శాఖ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు కొట్రేష్, రవీంద్రనాథ్, నాగయ్య, గంగాధర్ పాల్గొన్నారు. పెద్దవడుగూరులో చేపట్టిన నిరసన కార్యక్రమంలో సీపీఐ నాయకులు పోలా రంగస్వామి, ఓబిరెడ్డి, ఆదినారాయణ, అల్లాబకాష్, సుధాకర్‌గౌడ్, నాగేంద్ర, రంగనాయకులు, వెంకటరాముడు పాల్గొన్నారు. పామిడిలోని ఎద్దులపల్లి రోడ్డు అంబేద్కర్ సర్కిల్‌లో వామపక్ష నాయకులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వీరభద్రస్వామి, శ్రీనివాసులు, రహీం, అనిమిరెడ్డి, మల్లేష్, నాగరాజు పాల్గొన్నారు. యాడికి ట్రాన్స్‌కో కార్యాలయం వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమంలో నాయకులు జూటూరు రఫీ, రాముడు, బషీర్‌అహ్మద్, మోహన్, రాఘవ, నబీరసూల్ పాల్గొన్నారు. పుట్లూరు సబ్‌స్టేషన్ వద్ద నిర్వహించిన నిరసనలో రైతు సంఘం నాయకులు చిన్నికృష్ణుడుయాదవ్, చిన్నకుళ్లాయప్ప, ఓబులరెడ్డి, వీరయ్య పాల్గొన్నారు.